PRGI Reg No -"APTEL/26/A1193

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి...




ప్రతిక్షణం... ప్రజల కోసం...

www.netishubhodaya.com

96965 71571


ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, సంపుటి 01, సంచిక 105, సంపాదకులు : గొంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, శుక్రవారం - 05 - జూన్ - 2026 , వెల రూ.5/-

# కేటీఆర్ అలాంటి పొరపాటు వ్యాఖ్యలు చేయరు

## కేటీఆర్ తనపై తప్పుగా మాట్లాడి ఉండరన్న పవన్ కల్యాణ్

తమ ఇద్దరి మధ్య మంచి సోదర సంబంధం ఉందని వెల్లడి

మళ్లీ కలిసినప్పుడు సరదాగా మాట్లాడుకుంటామని స్పష్టీకరణ




హైదరాబాద్: తెలంగాణ మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తనను ఉద్దేశించి ఎలాంటి తప్పుడు వ్యాఖ్యలు చేసి ఉండరని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. తనకు కేటీఆర్‌తో మంచి సోదరభావ సంబంధం ఉందని, అనేక సందర్భాల్లో ఇద్దరం కలిశామని, తమ మధ్య పరస్పర ఇష్టాలు ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. బుధవారం అమరావతిలో మీడియాతో మాట్లాడిన సందర్భంగా, కేటీఆర్ వ్యాఖ్యల గురించి విలేకరులు అడిగిన ప్రశ్నకు పవన్ ఈ విధంగా స్పందించారు. "కేటీఆర్ గారు ఏమన్నారో నేను పూర్తిగా చూడలేదు. కానీ, నాకు తెలిసి ఆయన పొరపాటు మాటలు మాట్లాడరు. బహుశా ఆయన నా పూర్తి వ్యాఖ్యలు చూడలేదేమో. ఆయన ఒక సరైన దృక్పథంతోనే మాట్లాడి ఉంటారని అనుకుంటున్నా. కొన్నిసార్లు విషయాలను చిలికి చిలికి గాలివానలా మారుస్తుంటారు. దీనిపై అంతకుమించి ఏమీ లేదు" అని పవన్ కల్యాణ్ వివరించారు. విధానపరమైన అంశాల్లో భేదాభిప్రాయాలు ఉండటం సహజమని, అయితే తమ వ్యక్తిగత సంబంధం వేరని ఆయన పేర్కొన్నారు. ఈ వివాదంపై పెద్దగా స్పందించాల్సిన అవసరం లేదని, తామిద్దరం ఎప్పుడైనా కలిసినప్పుడు దీని గురించి సరదాగా మాట్లాడుకుంటామని పవన్ కల్యాణ్ తేలికగా వ్యాఖ్యానించారు.

## తెలంగాణకు మొదటి శత్రువు ఆ పార్టీనే

### రాష్ట్రంలో మోదీ, రేవంత్ జోడీ ప్రభుత్వం

పవన్ కల్యాణ్ గుర్తుపెట్టుకో..

తెలంగాణ ఇక్కడి భూమిపుత్రుల జాగీరే




తెలంగాణ ఓజీ.. కేసీఆర్

కాంగ్రెస్ పాలన డిజాస్టర్

జాతీయవాదం ముసుగులో ఆర్థిక ప్రాంతీయవాదం కరెక్టా?

హైదరాబాద్: "తొమ్మిదిన్నరేళ్ల భారాస పాలనలో అద్భుతమైన ప్రగతి సాధించిన తెలంగాణ.. రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో తిరోగమనంలో నడుస్తోంది. పాలన చేతకాని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. గత ప్రభుత్వంపై నెపం నెడుతున్నారు. ఈ ప్రభుత్వ నినాదమే రైజింగ్.. మిగతా 2 లో


2లో

## జూన్ 21న కోటి మందితో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం

- కోటి మందితో యోగాంధ్ర-2026: సీఎం చంద్రబాబు ప్రకటన
- 'యోగా ఫర్ హెల్తీ ఏజింగ్' థీమ్‌తో యోగాంధ్ర-2026 కార్యక్రమం
- పర్యాటక కేంద్రాలు, జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక యోగా ప్రదర్శనలు
- యోగాంధ్ర కోసం రూ.10 కోట్ల బడ్జెట్, ప్రత్యేక పోర్టల్ ప్రారంభం
- జూన్ నెలను 'యోగా నెల'గా ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం

## ఇరాన్‌కు హర్మూజ్ ఎంత ముఖ్యమో, మనకు ఈ జలసంధి అంత ముఖ్యం!

మలక్కా జలసంధిపై పట్టు సాధించేందుకు భారత్ భారీ వ్యూహం


2లో

గ్రేట్ నికోబార్ దీవిలో 9 బిలియన్ డాలర్లకు పైగా వ్యయంతో మెగా ప్రాజెక్ట్

చైనా వాణిజ్య, చమురు రవాణాకు కీలకమైన మార్గంపై నిఘా

## వచ్చీరావడంతోనే వరాల జల్లు కురిపించిన డీకే శివకుమార్...

### తొలి ప్రకటన ఇదే!

కర్ణాటక నూతన ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ బాధ్యతల స్వీకరణ

బెంగళూరు రోడ్ల అభివృద్ధి కోసం రూ. 2000 కోట్ల నిధులు కేటాయింపు

అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణకు వన్ టైమ్ సెటిల్‌మెంట్ పథకం

విద్యార్థులకు ఉచిత బస్ పాసులు, 50 వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి హామీ



కర్ణాటక: కర్ణాటక కొత్త ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన గంటల వ్యవధిలోనే డీకే శివకుమార్ కీలక నిర్ణయాలతో పాలనలో తనదైన ముద్ర వేశారు. సిద్ధరామయ్య రాజీనామా అనంతరం సీఎంగా బాధ్యతలు చేపట్టిన ఆయన, మిగతా 2 లో

## మాస్కో ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్ పై ప్రత్యేక ఆసక్తి

### రష్యా పర్యటనలో లోకేష్...

రష్యా పర్యటనలో మాస్కో అడ్వాన్స్‌డ్ ట్రాన్స్‌పోర్ట్ సెంటర్‌ను సందర్శించిన లోకేష్

మాస్కో రవాణా వ్యవస్థ పనితీరు అద్భుతమంటూ ప్రశంసలు

భారత్‌లో కూడా ఇటువంటి వ్యవస్థలు రావాలని ఆకాంక్ష

ఏఐ, డిజిటల్ టెక్నాలజీతో ట్రాఫిక్, భద్రత పర్యవేక్షణపై ప్రత్యేక ఆసక్తి

లోకేష్ బృందానికి అక్కడి రవాణా శాఖ ఉన్నతాధికారుల ఘనస్వాగతం



అమరావతి: మాస్కో అడ్వాన్స్‌డ్ ట్రాన్స్‌పోర్ట్ సెంటర్ పనితీరు అద్భుతంగా ఉందని, ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న మిగతా 2 లో



## తెలంగాణ ప్రజల్లో 'తెలంగాణ' అనే భావన ఉంటుంది...

## కానీ ఆంధ్రా ప్రజల్లో 'ఆంధ్రా' అనే భావన లోపించింది: పవన్

- తెలంగాణ ప్రజలను చూస్తే ముచ్చటగా ఉంటుందన్న పవన్ కళ్యాణ్
- తెలంగాణ అనే బలమైన భావన వారిలో ఉందని ప్రశంస
- ఆంధ్రాలో మాత్రం ఐక్యత లేదని, ఉప ప్రాంతీయతలే ఉన్నాయని ఆవేదన

2లో

## రాజ్యసభ సీటును కాంగ్రెస్ కు కేటాయించిన సీఎం విజయ్

తమిళనాడులో ఖాళీగా ఉన్న రాజ్యసభ సీటును కాంగ్రెస్‌కు కేటాయించిన టీవీకే


2లో

కూటమి బంధాన్ని బలోపేతం చేసే దిశగా సీఎం విజయ్ నిర్ణయం

అన్నాడీఎంకే నేత షణ్ముగం రాజీనామాతో ఖాళీ అయిన స్థానం

కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రవీణ్ చక్రవర్తి పేరు ప్రముఖంగా ప్రచారం



## భూములు, ప్లాట్లు, అపార్ట్‌మెంట్ల మార్కెట్ విలువ సవరణ

- తెలంగాణలో పెరగనున్న భూముల విలువలు.. జూన్ 5 నుంచి కొత్త రేట్లు!
- పెరగనున్న స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలు
- శాస్త్రీయ పద్ధతిలో విలువలు సవరించినట్లు తెలిపిన మంత్రి పొంగులేటి
- వాస్తవ ధరలకు అనుగుణంగా మార్పులు చేసినట్టు వెల్లడి

హైదరాబాద్: తెలంగాణలో భూములు, ప్లాట్లు, అపార్ట్‌మెంట్ల మిగతా 2 లో


# రాష్ట్రంలో భూములవిలువల సవరణకు ముహూర్తం ఖరారు

## నేటి నుంచి అమల్లోకి..అధికారికంగా ప్రకటించిన ప్రభుత్వం..

- ★ పాత విలువలునేడు ఒక్కరోజే వర్తింపు
- ★ వ్యవసాయ భూమి కనిష్ట ధర రూ.2.75 లక్షలు.. గరిష్ట ధర 30 కోట్లు
- ★ 'క్యూర్' లో చదరపు గజం కనిష్టంగా రూ.3 వేలు, చదరపు అడుగు రూ.2 వేలు
- ★ మున్సిపాలిటీల్లో చదరపు గజంకనిష్టంగా రూ.1,500,చదరపు అడుగు రూ.1,000
- ★ ప్రజలకు ఇబ్బంది లేకుండా వాస్తవ మార్కెట్ ధరల ఆధారంగా విలువలు నిర్ధారించాం



హైదరాబాద్: ఎట్టకేలకు రాష్ట్రంలోని భూముల విలువల సవరణకు ముహూర్తం ఖరారైంది. ఈ నెల 5వ తేదీ నుంచి సవరించిన రిజిస్ట్రేషన్ విలువలు అమల్లోకి వస్తాయ ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. కాగా, ఈ విలువల సవరణ కనిష్టంగా 15 శాతం, గరిష్టంగా 100 శాతం ఉంటుందని తెలుస్తోంది. బహిరంగ మార్కెట్‌లో భూములు, ఆస్తులకున్న విలువల ఆధారంగా ప్రస్తుత బేసిక్ రిజిస్టర్ విలువలను సరిచూసుకొని కొత్త విలువలను ప్రతిపాదించారు. వ్యవసాయ భూమి కనీస ధర రూ. 2.75 లక్షలు, గరిష్ట ధర రూ.30 కోట్లుగా నిర్ణయించినట్టు సమాచారం. మిగతా 2 లో



2లో

## ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగంపై నిర్ణయం వాయిదా


- 2 జాతీయ రహదారులకు కేంద్రం పచ్చజెండా..
- 4 వరుసలుగా ఆర్మూర్-జగిత్యాల-మంచిర్యాల, జగిత్యాల-కరీంనగర్ రోడ్లు
- ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదం

సెక్షన్ల వారీగా చేపట్టే పనుల వివరాలు ఇలా...

| జాతీయ రహదారి | ఆర్మూర్–జగిత్యాల సెక్షన్(ఎన్‌హెచ్–63) | జగిత్యాల–మంచిర్యాల సెక్షన్(ఎన్‌హెచ్–63) | జగిత్యాల–కరీంనగర్ సెక్షన్(ఎన్‌హెచ్–563) |
|---|---|---|---|
| కిలోమీటర్లు | 63 | 68 | 59 |
| బ్రౌన్‌ఫీల్డ్ రహదారి(కి.మీ) | 18 | 2 | 24 |
| గ్రీన్‌ఫీల్డ్ రహదారి(కి.మీ) | 45 | 66 | 35 |
| సివిల్ పనుల విలువ(రూ.కోట్లలో) | 1,266.58 | 1,477.17 | 1,455.01 |
| భూ సేకరణ(రూ. కోట్లలో) | 504.26 | 436.93 | 394.53 |
| మొత్తం ప్రాజెక్టు విలువ(రూ.కోట్లలో) | 2,471.76 | 2,730.72 | 2,394.68 |
| 2024-25లో ట్రాఫిక్ (రోజుకు సగటున ప్రయాణించే వాహనాల సంఖ్య) | 14,949 | 12,084 | 20,446 |

## హిజ్బుల్లా వెనక్కి తగ్గితేనే శాంతి.. వాషింగ్టన్ చర్చల్లో ఇజ్రాయెల్-లెబనాన్ కాల్పుల విరమణ ఒప్పందం!

దక్షిణ లితానీ సెక్టార్ నుంచి హిజ్బుల్లా పూర్తిగా తప్పుకోవాలని షరతు


2లో

అమెరికా మధ్యవర్తిత్వంతో వాషింగ్టన్‌లో ఇజ్రాయెల్, లెబనాన్ సంయుక్త ప్రకటన

గత నెలలో ఒప్పందం విఫలమైనా, తాజా చర్చల్లో లభించిన పురోగతి

## “జనసేన పండు ఆధ్వర్యంలో ప్రత్తిపాడు లో ఉచిత కంటి వైద్య శిబిరం”



పెంటపాడు జూన్ 4 (అవినాష్ మారంపూడి నేటి శుభోదయ):::పెంటపాడు మండలం ప్రత్తిపాడు గ్రామానికి చెందిన జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి మరియు ప్రతిపాడు గ్రామ జనసేన పార్టీ ఇన్చార్జి చెరుకూరి జగత్ సోమశేఖర్ (పండు) ఆధ్వర్యంలో శాసన సభ్యులు ప్రభుత్వ విప్ బోలిశెట్టి శ్రీనివాస్ సూచనల మేరకు పంచాయతీ కార్యాలయం ఆవరణలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఓట్లు లెక్కింపు జరిగి ఫలితాలు వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అంతకుముందు ఐదు సంవత్సరాలు రాష్ట్రాన్ని పట్టిపీడించిన వైసీపీని ప్రజలు చిత్తుగా ఓడించి టిడిపి, జనసేన, బిజెపి కూటమికి అత్యధిక మెజారిటీతో పట్టం కడుతూ తీర్పు వెలువడిన రోజు ఇది అన్నారు. రాష్ట్రం విధ్వంసం నుంచి వికాసం దిశగా బయటపడిన రోజు అని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి పై దృష్టి పెట్టిందని చెప్పారు. గ్రామ అభివృద్ధి మరియు స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్రకారము ౹ా4 లో భాగంగా గ్రామ అభివృద్ధికి నడుం కట్టిందని తెలియజేశారు. ఇటువంటి స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు భాగంగా ఈ నేత్ర వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందని, దీనిని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఆమెన్ ట్రస్ట్ మరియు శంకర నేత్రాలయ ఏలూరు వారిచే ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆమేన్ ట్రస్ట్ మేనేజర్ కరెడ్డి అశోక్ మాట్లాడుతూ పోషకాహార లోపం, ఆకుకూరలు తినకపోవడం వల్ల కంటి సమస్యలు ఎక్కువగా వస్తాయని తెలిపారు. ఈ సమస్యలను పరిష్కరించుకోవాలంటే ఆకుకూరలు తినాలని సూచించారు. శంకర్ నేత్రాలయ ప్రోగ్రాం డైరెక్టర్ పి.ఆనంద్ మాట్లాడుతూ 50 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు ప్రతి అరు నెలలకు ఒకసారి పరీక్షలు చేయించుకోవాలని తెలియజేశారు. డాక్టర్ అతిర సి. మాట్లాడుతూ 50 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కంటి శుక్లం (కెట్రాక్స్) వయస్సు పైబడటం వల్ల కంటిలోని కటకం (లెన్స్) పొరలు కమ్మినట్లుగా మసకబారుతుందన్నారు. చూపు మసకబారడం, రాత్రి పూట సరిగ్గా కనిపించకపోవడం వంటివి లక్షణాలు కనిపిస్తాయని సూచించారు. ప్రారంభ దశలో అద్దాలు వాడవచ్చుని, ముదిరితే చిన్న ఆపరేషన్ ద్వారా కటకాన్ని మార్చాల్సి ఉంటుందన్నారు. స్వచ్ఛంద సేవా సంస్థలు నిర్వహిస్తున్నటువంటి ఈ కార్యక్రమాలను తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలని దీని ద్వారా కంటికి సంబంధించిన వ్యాధుల నుంచి పరిరక్షించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారు 210 మంది గ్రామ ప్రజలు కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రతిపాడు గ్రామ జనసేన పార్టీ గౌరవ అధ్యక్షులు మజ్జి అప్పారావు, జనసేన పార్టీ ప్రెసిడెంట్ మట్టా రాంబాబు, యానాతుల సుబ్బారాజు, శ్రీకాంత్, నాగు, తుమ్మగంటి సుధీర్, తాడిపర్తి సత్యనారాయణ, పైళ్లమ్మ యూత్, సత్యమేవ జయతే యూత్, వన్ టీమ్ వన్ విజన్ యూత్, చింతలంక యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## “సూపర్ సిక్స్‌పై వైసీపీ నిరసన-కూటమి హామీలు నెరవేర్చాలి”

### “వాగ్దానాల అమలుపై వైసీపీ డిమాండ్”




గూడెం కొత్త వీధి,నేటి శుభోదయ,జూన్ 4: ఎన్నికల సమయంలో ఇచ్చిన మేనిఫెస్టో, సూపర్ సిక్స్ హామీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కంకిపాటి గిరి ప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో వైసీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన “చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు -- నిరసన కార్యక్రమం”లో ఆయన మాట్లాడారు.మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు, పాడేరు ఎమ్మెల్యే, అల్లూరి జిల్లా వైసీపీ అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో టీడీపీ--జనసేన--బీజేపీ కూటమి మహిళలకు నెలకు రూ.1,500 చొప్పున ఆడబిడ్డ నిధి, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, రైతులకు ఏడాదికి రూ.20 వేల ఆర్థిక సాయం, ఇంటింటికీ తాగునీటి కుళాయిలు, 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల భృతి, వాలంటీర్లకు రూ.10 వేల వేతనం తదితర హామీలు ఇచ్చిందని, వాటిలో అనేకం ఇప్పటికీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని విమర్శించారు.వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఎన్నికల హామీలతో పాటు మేనిఫెస్టోలో లేని పలు సంక్షేమ కార్యక్రమాలను కూడా అమలు చేశారని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కొర్ర రాజులమ్మ, మండల ఉపాధ్యక్షుడు వంతల అరుణ్‌కుమార్,నాయకులు వంతల చంటిబాబు,వనపల రాజేష్,లొంజా గణపతి,పాతూను లక్ష్మణ్, కొర్ర బాబి కొర్ర రాంబాబు, పొత్తురు గంగరాజు, కంకిపాటి శ్రీరాములు, సత్తిబాబు,గేమ్మెల కోటి బాబు, వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## మురుగు కాలువల శుభ్రత “ఆపరేషన్ క్లీన్ స్వీప్”



తాడేపల్లిగూడెం జూన్ 4 (అవినాష్ మారంపూడి నేటి-శుభోదయ) జట్లపాలెం రోడ్డులో మురుగు కాలువల శుభ్రత పనులుఎ కమిషనర్ ఏసుబాబు స్వయంగా క్షేత్రస్థాయిలో పాల్గొని పార చేతపట్టి కాలువల పక్కన ఉన్న చెత్త, గడ్డిని తొలగించారు. జట్లపాలెం రోడ్డులోని ప్రధాన మురుగు కాలువల్లో పేరుకుపోయిన పూడిక, ప్లాస్టిక్ వ్యర్థాలను జెసిబి సహాయంతో పూర్తిగా తొలగించి, నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టామని కాలువలు శుభ్రం చేసిన అనంతరం దోమల నివారణకు బ్లీచింగ్ పౌడర్ చల్లి, మలాథియాన్ స్ప్రే చేయించామన్నారు. మురుగు కాలువల్లో చెత్త వేయడం వల్ల నీరు నిలిచిపోయి దోమలు, రోగాలు వస్తాయని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు సిబ్బందికి, స్థానిక ప్రజలకు తెలియజేశారు.ఈ సందర్భంగా కమిషనర్ వీ. యేసుబాబు మాట్లాడుతూ ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాన్ని పట్టణంలోనీ అన్ని ప్రాంతాలలో నిర్వహిస్తున్నామని తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా జట్లపాలెం రోడ్డులో ఉన్న డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాం అన్నారు. అధికారులు, సిబ్బంది అందరూ కలిసి శ్రమిస్తేనే పట్టణం పరిశుభ్రంగా ఉంటుంది అని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది,శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు,పారిశుధ్య కార్మికులు, వార్డు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాజానగరం కార్యాలయంలో ప్రజలు నుండి అర్జీల స్వీకరించి, తక్షణ పరిష్కారాలు చేసిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ..



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ అవిరామంగా శ్రమిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం రాజానగరంలోని ప్రధాన కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.ఉదయం 10 గంటల నుండి నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు, మహిళలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రజలు తమకు ఎదురవుతున్న పలు రకాల సమస్యలపై, వ్యక్తిగత మరియు సామాజిక అవసరాలపై ఎమ్మెల్యే బలరామకృష్ణకి స్వయంగా అర్జీలను సమర్పించారు. రైతు సమస్యలు, పింఛన్లు, రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు వంటి పలు విషయాలపై ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వచ్చిన ప్రతి ఒక్క అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, బాధితులతో మాట్లాడి వారి సమస్యల తీవ్రతను తెలుసుకున్నారు. అర్జీల స్వీకరణ అనంతరం తక్షణమే స్పందించారు. పలు సమస్యల తీవ్రతను బట్టి సంబంధిత శాఖల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడారు.ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఆశతో కార్యాలయానికి వస్తున్నారు. అధికారులు ఏమాత్రం నిర్లక్ష్యం వహించకుండా, నిబంధనల ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికీ తక్షణమే న్యాయం చేయాలి. ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు.తమ సమస్యలను ఓపికగా విని, అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కార మార్గం చూపిన ఎమ్మెల్యే బలరామకృష్ణ చొరవ పట్ల నియోజకవర్గ ప్రజలు మరియు లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే నాయకుడు దొరకడం ఆనందంగా ఉందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## “మారంపల్లి కి శాశ్వత రహదారికి కృషి చేస్తానని ప్రకటించిన కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ”

### మారంపల్లి గ్రామ రహదారి నిర్మాణానికి భూమి కొనుగోలుకు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ రూ.10 లక్షల ఔదార్యం రైతులకు రూ.20 లక్షల అడ్వాన్స్ పంపిణీ



తాడేపల్లిగూడెం జూన్ 4 (అవినాష్ మారంపూడి నేటి- శుభోదయ)తాడేపల్లిగూడెం రూరల్ మండలం మారంపల్లి గ్రామానికి ప్రత్యామ్నాయ రహదారి నిర్మాణం కోసం అవసరమైన సహాయ సహకారాలను అందజేయనున్నట్లు కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ ప్రకటించారు. ఈ సందర్భంగా తాడేపల్లిగూడెం శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ తన సొంత నిధుల నుండి రూ.10 లక్షలు అందించగా, గ్రామస్తుల విరాళాల రూపంలో మరో రూ.10 లక్షలు సమీకరించి మొత్తం రూ.20 లక్షలను భూమి నష్టపోతున్న ఆరుగురు రైతులకు అడ్వాన్స్‌గా అందజేశారు.భీమవరం కలెక్టరేట్‌లోని వశిష్ట సమావేశ మందిరంలో గురువారం మారంపల్లి గ్రామ రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.పీఎం గతి శక్తి పథకంలో భాగంగా మంజూరైన ఆర్ఓబీ-379 నిర్మాణం కారణంగా మారంపల్లి గ్రామానికి ప్రస్తుతం ఉన్న రాకపోకల మార్గం మూసివేయబడే పరిస్థితి నెలకొనడంతో గ్రామస్తులు స్థానిక ఎమ్మెల్యే దృష్టికి సమస్యను తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను కేంద్ర మంత్రి మరియు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. మారంపల్లికి ప్రత్యామ్నాయ రహదారి నిర్మాణానికి సుమారు 1.20 ఎకరాల భూమి అవసరమవుతుందని రెవెన్యూ అధికారులు గుర్తించారు. అయితే ఈ భూమి 2016 సంవత్సరం నుండి 22(ఏ) జాబితాలో నమోదు కావడంతో సమస్య తలెత్తింది. సంబంధిత భూమి గ్రామ సముదాయ భూమిగా రికార్డుల్లో నమోదై ఉండటంతో దేవాదాయ శాఖకు చెందినదిగా పరిగణించబడుతోంది. అయితే ఈ భూమి తమ స్వంత భూమేనని, గత ప్రభుత్వం 22(ఏ)లో చేర్చిందని రైతులు పేర్కొంటూ 22(ఏ) తొలగించి తమ హక్కులను పునరుద్ధరించాలని అధికారులను కోరారు. ఈ విషయమై స్పందించిన జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ భూమి వివరాలను ఎండోమెంట్స్ కమిషనర్‌కు పంపించి 22(ఏ) తొలగింపునకు అవసరమైన చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు. ఈ లోపు గ్రామ ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు రైతుల నుండి భూమి పొందడానికి ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తన సొంత నిధుల నుండి రూ.10 లక్షలు, గ్రామస్తుల నుండి సేకరించిన విరాళాల రూపంలో మరో రూ.10 లక్షలు సమీకరించి మొత్తం రూ.20 లక్షలను ఆరుగురు రైతులకు అడ్వాన్స్‌గా కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పీఎం గతి శక్తి పథకం కింద ఆర్ఓబీలు, ఆర్‌యూబీలు మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఈ ప్రాజెక్టుల వల్ల కొన్ని గ్రామాల్లో రహదారి సమస్యలు తలెత్తుతున్నప్పటికీ వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మారంపల్లి సమస్యను స్థానిక ఎమ్మెల్యే తన దృష్టికి తీసుకువచ్చారని, ప్రస్తుతం రహదారి నిర్మాణానికి అవసరమైన భూమి 22(ఏ)లో ఉండటంతో జిల్లా కలెక్టర్ సీసీఎల్ఏకు ప్రతిపాదనలు పంపి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. రహదారి నిర్మాణానికి అవసరమైన నిధుల సమీకరణలో కూడా తనవంతు సహకారం అందిస్తానన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, మౌలిక వసతుల అభివృద్ధికి ఎన్డీఏ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ మారంపల్లి రహదారి సమస్యను ఎమ్మెల్యే తన దృష్టికి తీసుకువచ్చారని, నూతన రహదారి నిర్మాణానికి అవసరమైన భూమి ప్రస్తుతం 22(ఏ)లో నమోదై ఉండటంతో ఎండోమెంట్స్ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపించి 22(ఏ) తొలగింపునకు కృషి చేస్తామని తెలిపారు.ఎమ్మెల్యే మరియు ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ గత 50 నుండి 60 సంవత్సరాలుగా సరైన రహదారి సౌకర్యంలేక మారంపల్లి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా రైతులు పొలాల నుండి పంటలను తరలించేందుకు చాలా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆర్ఓబీ నిర్మాణంతో రైల్వే స్థలంలో సాగుతున్న రాకపోకలు కూడా నిలిచిపోతాయని, గ్రామానికి పూర్తిగా రహదారి లేకుండా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేయడంతో ప్రత్యామ్నాయ రహదారి నిర్మాణానికి భూమి సేకరణ చేపట్టినట్లు తెలిపారు. రైతులకు న్యాయం జరిగేలా, గ్రామ ప్రజలకు శాశ్వత రహదారి సౌకర్యం కల్పించేలా అన్ని విధాలా కృషి కొనసాగిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో తాడేపల్లిగూడెం తహసిల్దార్ టి.రాజరాజేశ్వరి, జనసేన పార్టీ జిల్లా ప్రెసిడెంట్ కొటికలపూడి చినబాబు, మారంపల్లి రైతులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆస్తుల భద్రత కోసమే ప్రభుత్వ రాజముద్ర కలిగిన పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ

- రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

- పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి



కొత్తచెరువు, పుట్టపర్తి, నేటి శుభోదయ ::: రైతుల ఆస్తుల పరిరక్షణ, భూ హక్కుల భద్రత కోసమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రభుత్వ రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేస్తోందని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు.కొత్తచెరువు మండలంలోని తిరుమలదేవరపల్లిలో సుమారు 320 మంది రైతులకు , ఇరగంపల్లి లో సుమారు 142 మంది రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, ఆర్డీఓ సువర్ణ, తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి తో కలిసి రైతులకు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పట్టాదారు పాసుపుస్తకాలపై ప్రభుత్వ గుర్తింపుకు బదులుగా అప్పటి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఫోటోను ముద్రించడం ద్వారా భూముల విషయంలో అనేక అనుమానాలకు తావిచ్చారని విమర్శించారు. రైతుల ఫోటో బదులుగా జగన్ రెడ్డి ఫోటో ఎందుకు ముందరించారని కేవలం భూ దోపిడీ కోసమే అని ఆరోపించారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ల్యాండ్ టైటిల్ యాక్ట్ తీసుకొచ్చి రైతుల భూములను బ్యాంకుల్లో తాకట్టు పెట్టీ కోట్లు డబ్బులు కాజెసే ప్రయత్నానికి గత వైసిపి ప్రభుత్వ పెద్దలు భారీ స్కెచ్ ఇస్తారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆందోళనలో ఉన్న రైతులకు చంద్రబాబు అండగా నిలబడ్డారని తెలిపారు. గత ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జగన్ తీసుకొచ్చిన ల్యాండ్ టైటిల్ యాక్టర్ రద్దు చేస్తామని





ఇచ్చిన హామీ మేరకు వెంటనే వాటిని రద్దు చేసి రైతుల భూ హక్కులను పరిరక్షించే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు ఫోటోతో పాటు ప్రభుత్వ రాజముద్ర కలిగిన పట్టాదారు పాసుపుస్తకాలను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, వ్యవసాయ రంగ అభివృద్ధితో పాటు రైతుల ఆస్తుల రక్షణకు కట్టుబడి ఉందని తెలిపారు. రైతులకు అవసరమైన అన్ని సేవలను పారదర్శకంగా అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 24 మాసాల్లోనే ఎన్నికలకు ముందు కూటమి పార్టీలు ఇచ్చిన 99 శాతం హామీల్లో టీడీపీ ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను సూపర్ హిట్ చేసిందని తెలిపారు. తల్లికి వందనం పథకం ద్వారా చదువుకొని ప్రతి విద్యార్థికి ఏడాదికి 15000 తల్లి ఖాతాలో జమ మహిళలకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. రైతులకు అండగా నిలుస్తూ పెట్టుబడి సాయం కింద ఏడాదికి 20 వేల రూపాయలు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా వారి ఖాతాల్లో 20,వేలు జమ చేసినట్లు వెల్లడించారు. అంతే కాకుండా రాష్ట్రంలో సంక్షేమం తో పాటు అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తూ రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం సుపరిపాలన సాగిస్తోందని తెలిపారు. పుట్టపర్తి నియోజకవర్గంలో కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నట్లు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి వెల్లడించారు. లక్ష కోట్లతో పుట్టపర్తిలో యుద్ధ విమానాల తయారీ విడిభాగాల పరిశ్రమ ఏర్పాటు వల్ల వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి అన్నారు. అంతేగాకుండా దేశంలోనే అతిపెద్ద సోలార్ ప్రాజెక్ట్ అమ్మడు మండలంలో 30 వేల ఎకరాల్లో సుమారు 51 400 కోట్లు తో రిలయన్స్ సోలార్ విద్యుత్ ప్రాజెక్టును త్వరలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు ఏర్పాటు వల్ల ఈ ప్రాంత రైతాంగం తో పాటు నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. అదేవిధంగా నియోజకవర్గంలో 193 చెరువులతో పాటు రెండు రిజర్వాయర్లకు హంద్రీనీవా కాలువ ద్వారా కృష్ణాజిల్లాలు తీసుకొచ్చి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారని ఆమెకు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి నియోజకవర్గ ప్రజలు తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆర్డీవో సువర్ణ మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తుందని తెలిపారు వివాదాలు లేని రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దాలని ఆలోచనతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెవిన్యూ సదస్సులు ఏర్పాటు చేసి నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను ప్రభుత్వ రాజముద్ర కలిగిన రైతు ఫోటోతో పుస్తకాలను అందజేస్తుందని ప్రతి ఒక్కరూ వీటిని సద్వినియోగం చేసుకో...



## “వెన్నుపోటుకు రెండేళ్లు ఎన్నికల సమయం ఇచ్చిన హామీలన్నీ విఫలం వైసీపీ ఇన్చార్జ్ వడ్డీ రఘురాం నాయుడు”




పెంటపాడు జూన్ 4 (అవినాష్ మారంపూడి నేటి శుభోదయ)::: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా ప్రభుత్వం విఫలమైందని, గత రెండేళ్లుగా ప్రజలకు వెన్నుపోటు పొడిచి మోసం చేస్తున్నారని వైసిపి ఇన్చార్జ్ వడ్డీ రఘురామనాయుడు విమర్శించారు. గురువారం పెంటపాడు గాంధీ బొమ్మ సెంటర్లో వెన్నుపోటుకు రెండు ఏళ్ళు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘురామ నాయుడు మాట్లాడుతూ ప్రజలకు వివరించేందుకు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు తాడేపల్లిగూడెం కూటమి ప్రభుత్వం విడుదల చేసిన మేనిఫెస్టో ప్రతిని, హామీల బాండ్ పేపర్లను వైసీపీ కార్యకర్తలు తగలబెట్టారు. అనంతరం కూటమి ప్రభుత్వ వైఫల్యాలను, వారు చేసిన మోసాలను ప్రజలకు వివరించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్నప్పటికీ, ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఉద్యోగాలు, రైతు సంక్షేమం, మహిళా సాధికారత, యువత అభివృద్ధి వంటి అనేక అంశాల్లో ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు.ప్రజలకు ఇచ్చిన మాటలను నిలబెట్టుకోకుండా హామీలను తుంగలో తొక్కిన కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వెన్నుపోటు దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు.ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగుతుందని ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని అన్నారు. ఎన్నికల సమయంలో ఇస్తానన్న నిరుద్యోగ భృతి, పేదలకు పక్కా ఇల్లు, ప్రతి మహిళకు1500/- రూపాయలు,ఇంటికో ఉద్యోగం, డ్వాక్రా రుణమాఫీ తదితర పథకాలలో ఇవ్వకుండా మోసం చేసిందని అన్నారు. మట్టి మాఫియా ఏ గ్రామంలో చూసిన చెరువులు వదలకుండా ఎవరు ఇష్టానుసారముగా వాళ్ళు కూటమి నాయకులు దోపిడీ చేసి జేబులో నింపుకుంటున్నారని ఎక్కడ కూడా కాలువ గట్లు పుంతగట్లు ఇస్తానుసారముగా రాత్రింబవళ్లు త్రవ్వి జేబులు నింపుకొని రోడ్లు పాడు చేస్తున్నారని ఆయన అన్నారు. మట్టి తోలుతున్న లారీని ఆపి ఎక్కడకు వెళుతుందని అడగగా తణుకులో సైట్ పుడుస్తున్నామని చెప్పారని ఆయన అన్నారు.

ఇదేనా మీరు చేస్తున్నఅభివృద్ధి అని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలు ఏ ఒక్క హామీలను అమలు చేయలేదు అన్నారు.ఈ కార్యక్రమంలో పెంటపాడు మండలం అధ్యక్షులు కైగాల శ్రీనివాసరావు, పెంటపాడు వైసిపి గ్రామ పార్టీ అధ్యక్షుడు ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, వింజమూరి శ్రీనివాసరావు, కర్రీ వరహాలు రెడ్డి, కర్రీ శివారెడ్డి, కర్రీ పృద్వి కుమార్ రెడ్డి, నల్లమిల్లి అప్పిరెడ్డి , మారంపూడి ఏసుదాసు, ఉండ్రాజవరపు రాజు, చదలవాడ శ్రీనివాస్, కునుకు పుల్లయ్య, సంపత్ రావు కృష్ణారావు, రెడ్డి శ్రీనివాస్, దాట్ల రామలింగరాజు, కొలుపూరి శివ కిరణ్, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## స్వర్గీయ గాజుల లీలాకుమారికి
# ఆకుల, శీలంశెట్టి తదితరుల ఘన నివాళి



ఖమ్మం, నేటి శుభోదయ ::: ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం తనికెళ్లకు చెందిన మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ గాజుల కృష్ణమూర్తి సతీమణి లీలాకుమారి (లీలమ్మ) గత నెల 25వతేదీన పరమపదించారు.ఈ సందర్భంగా వారి స్వగృహంలో గురువారం దశదిన కర్మకాండ జరిగింది. ఈ కార్యానికి మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ, జిల్లా అధ్యక్షులు శీలంశెట్టి వీరభద్రం, నాయకులు బండి లక్ష్మీనారాయణ, యాసా సత్యనారాయణ, యాసా రోశయ్య, గడల సీతారామయ్య,గాజుల వెంకటేశ్వరరావు, గాజుల ప్రసాద్, గడల శ్రీనివాసరావు, వనం శ్రీనివాసరావు, ఆకుల ప్రశాంత్ కుమార్,ఆకుల సురేష్,తదితరులు హాజరై దివంగత లీలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు.ఆమె కుమారులు రాజేష్, సురేష్,నరేష్, కూతురు నిర్మల తదితర కుటుంబ సభ్యులను గాంధీ,వీరభద్రం తదితరులు పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే గిరిజన సంక్షేమ శాఖ లక్ష్యం
## జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కమలాకర్ రెడ్డి




వికారాబాద్ జూన్ 04నేటి శుభోదయ:కుల్కచర్ల:గ్రామీణ నిరుద్యోగుల ఉపాధి అవకాశాలను అభివృద్ధి చేయడం చాలా ముఖ్యమని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కమలాకర్ రెడ్డి తెలిపారు. పరిగి నియోజకవర్గం లోని కుల్కచర్ల మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగాగ్రామీణ యువతకు నైపుణ్యాభివృద్ధి(స్కిల్ ట్రైనింగ్) నిర్వహించడం ద్వారా వారికి స్థిరమైన ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఈ శిక్షణలు చేపడుతున్నామన్నారు.యువత తమ ప్రతిభను మెరుగుపరుచుకుని ఉద్యోగ అవకాశాలను పొందగలరని వివరించారు.నిరుద్యోగులు



ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల శిక్షణ,ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో యువత స్వయం ఉపాధి వైపు దృష్టి సారించాలని కూడా పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ నాయక్, గిరిజన సంక్షేమ శాఖల అధికారులు ప్రజా ప్రతినిధులు గిరిజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ సైబర్ నేరాల పట్ల రోడ్డు భద్రత హెల్మెట్ కచ్చితంగా ధరించాలి
### -గున్ గల్ గ్రామసభలో సిఐ నందీశ్వర్ రెడ్డి.-గ్రామ సర్పంచ్ బాసాని బుచ్చిరెడ్డి.

ఇబ్రహీంపట్నం (నేటి శుభోదయ)ప్రతినిధి జూన్ 4:యాచారం మండల పరిధిలో గురువారం గున్ గల్ గ్రామసభల అవగాహన కార్యక్రమం,గున్ గల్ గ్రామసభలో సీఐ నందీశ్వర్ రెడ్డి పాల్గొని గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు.ముఖ్యంగా హెల్మెట్ వినియోగం,డ్రగ్స్ దుష్ప్రభావాలు, సైబర్ నేరాల పట్ల జాగ్రత్తలు, రోడ్డు భద్రత నియమాలు గురించి వివరించారు.యువత,విద్యార్థులు, తల్లిదండ్రులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు.మొబైల్ ఫోన్, సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న సైబర్ మోసాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నియమాలను పాటించాలని సూచించారు. గ్రామ ప్రజలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని సీఐ సూచనలను ఎంతో శ్రద్ధగా విన్నారు.సీఐ ఇచ్చిన సలహాలు సూచనలను తమ జీవితంలో తప్పకుండా అమలు చేస్తామని గ్రామ ప్రజలు హామీ ఇచ్చారు.సమాజంలో శాంతి భద్రతలు, రోడ్డు భద్రత సైబర్ భద్రత కోసం పోలీసు శాఖతో సహకరిస్తామని గ్రామస్థులు తెలిపారు.అవగాహనతోనే భద్రత --భద్రతతోనే అభివృద్ధి కార్యక్రమంలో గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సేవలకు వీడ్కోలు చెప్పి.. జీవితానికే వీడ్కోలు



తిరుపతి, జూన్ 4 ,(నేటి శుభోదయ) :: పోలీసు శాఖలో ఎన్నో సంవత్సరాలు సేవలందించిన రిటైర్డ్ డీఎస్పీ రసూల్ బాషా ఆకస్మిక మృతి చెందడం కుటుంబ సభ్యులు, సహచరులు, స్థానికులను తీవ్ర విషాదంలో ముంచింది. తిరుపతి జిల్లా పాకాల మండలం దామలచెరువు కు చెందిన రసూల్ బాషా బుధవారం అర్ధరాత్రి గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు.ఇటీవలే, గత నెల 30వ తేదీన పోలీసు శాఖలో తన సేవలకు ముగింపు పలికి పదవీ విరమణ పొందిన రసూల్ బాషా, రిటైర్మెంట్ జీవితాన్ని ప్రారంభించిన కేవలం మూడు రోజులకే మృత్యువాత పడడం అందరినీ కలచివేసింది. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో వివిధ హోదాల్లో పనిచేసిన ఆయన విధి నిర్వహణలో నిబద్ధత, క్రమశిక్షణకు పేరుగాంచారు. రిటైర్మెంట్ అనంతరం కుటుంబ సభ్యులతో ప్రశాంత జీవితం గడపాలని భావించిన సమయంలోనే ఆయన ఆకస్మిక మరణం చెందడం అత్యంత విషాదకరమని పలువురు పేర్కొన్నారు. దామలచెరువులో ఆయన మృతదేహానికి ప్రజాప్రతినిధులు, మాజీ సహచరులు, గ్రామస్తులు, అభిమానులు నివాళులర్పించి తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. "సేవా జీవితానికి వీడ్కోలు పలికిన కొద్ది రోజుల్లోనే శాశ్వత వీడ్కోలు చెప్పడం అందరినీ కన్నీటి పర్యంతం చేసింది" అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

# ఉనికి కోసమే వైసీపీ నాయకుల ఆరాటం



యాడికి జూన్ 04 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : తెలుగుదేశం పార్టీ అధికారం లోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ప్రజలందరూ సుభిక్షంగా ఉంటే వైసిపి వారు మాత్రం వెన్నుపోటు దినమంటూ యాడికి మండల కేంద్రంలో నిరసనకు దిగడం వారి అజ్ఞానానికి నిదర్శనం అని టీడీపీ సీనియర్ నాయకులు గొర్తి రుద్రమ నాయుడు యాడికి లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ పథకాలు అన్ని ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ప్రజల మన్ననలు పొందుతూ ఉందని అన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో ఒక్క టీచర్ పోస్టు కూడా ఇవ్వకుండా తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన తర్వాత డీఎస్సీ ద్వారా ప్రభుత్వ ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేసిందని అన్నారు. స్పోర్ట్స్ కోటాలో నిబంధనల ప్రకారం ఉద్యోగాలు ఇచ్చారని దాన్ని కూడా విమర్శించడం అవివేకం అన్నారు. గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్ అమరావతి రాజధాని అభివృద్ధి చేయకుండా మూడు రాజధానులని ఐదు సంవత్సరాలు కాలయాపన చేయడం వల్లనే 11 స్థానాలకు వైసిపి పడిపోయిందని అన్నారు. వృద్ధాప్య పెన్షన్ ను 2000 నుండి మూడు వేల పెన్షన్ పెంచడానికి ఐదు సంవత్సరాలు పట్టిందని, టిడిపి ప్రభుత్వం వచ్చిన వెంటనే నాలుగువేల పెన్షన్ మంజూరు చేసిందని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్, మద్యపాన నిషేధం చేస్తామని అబద్ధపు హామీ, వైసిపి నాయకుల బూతు పురాణాలతో వైసిపి ప్రభుత్వం సమాధి అయి నేటికీ రెండు సంవత్సరాలు పూర్తి అయిందన్నారు. సమస్యలు అసెంబ్లీకి పోయి మాట్లాడాలని ఈ నాయకునికి తెలపండని కోరారు. ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని వై సిపి వారు మాత్రం బాధపడుతున్నారని అన్నారు.

# భవిష్యత్తు తరాల కోసం పర్యావరణాన్ని కాపాడుకుందాం

**: జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**
**- గ్రామాలలో చెత్త నిర్వహణ, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి**
**- వరదల సమయంలో ప్రజలు అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలి**
**- ప్రత్యామ్నాయ పంటల సాగు, సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి**
**- ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంపై అపోహలను వీడి ప్రజలు సహకరించాలి**
**- అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఎస్.ఐ.ఆర్. లక్ష్యం**
**- ఖమ్మం రూరల్ మండలం గోళ్లపాడు గ్రామ సభలో పాల్గొన్న జిల్లా కలెక్టర్**




ఖమ్మం, ఖమ్మం రూరల్, నేటి శుభోదయ ::: భవిష్యత్తు తరాల కోసం మనమందరం పర్యావరణాన్ని కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. ఖమ్మం రూరల్ మండలం గోళ్లపాడు గ్రామంలోనీ రైతు వేదికలో నిర్వహించిన గ్రామ సభలో జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రజలతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ గ్రామ, వార్డు సభలు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే ముఖ్య వేదికలని అన్నారు. ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంపై సమగ్ర వివరాలు తెలియజేసి, ప్రజలు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. ఇరిగేషన్ శాఖకు సంబంధించిన కాలువల అభివృద్ధి, సాగునీటి పనుల పురోగతిపై గ్రామస్తులతో చర్చించారు. రాబోయే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఎరువుల కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని తెలిపారు. నానో యూరియా వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు.పంటల మార్పిడి విధానంపై రైతులకు అవగాహన కల్పిస్తూ, వాతావరణ శాఖ అంచనాలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ పంటలైన ఆయిల్‌పామ్, కూరగాయలు, పండ్ల తోటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు.వర్షాభావ పరిస్థితులు తక్కువగా ఉన్న నేపథ్యంలో బోర్‌వెల్ సౌకర్యం కలిగిన రైతులు షార్ట్ డ్యూరేషన్ వరి సాగు చేపట్టవచ్చని తెలిపారు. పంటలకు రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి సేంద్రీయ వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.గ్రామాలలో చెత్తను సమర్థవంతంగా నిర్వహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న జనాభా నేపథ్యంలో పర్యావరణ కాలుష్యం పెరుగుతోందని, ప్రస్తుతం స్వచ్ఛమైన తాగునీటి కోసం డబ్బులు చెల్లిస్తున్నామని, భవిష్యత్తులో స్వచ్ఛమైన గాలి కోసం కూడా డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి రాకుండా పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని సూచించారు.భవిష్యత్ తరాలు మెరుగైన జీవనం సాగించాలంటే పర్యావరణ పరిరక్షణ అత్యంత ముఖ్యమని అన్నారు. వాతావరణ మార్పుల ప్రభావంతో ఒకేరోజు కుంభవృష్టి తరహా వర్షాలు కురిసి వరదలు సంభవిస్తున్నాయని, అడవుల నరికివేత కారణంగా కోతులు జనావాసాల్లోకి వస్తున్నాయని తెలిపారు. కోతుల సమస్యకు తక్షణ పరిష్కారం లేదని, గ్రామస్థులు తమ జీవన విధానంలో మార్పులు చేసుకుంటేనే శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు.జిల్లాకు సమగ్ర విపత్తు నిర్వహణ ప్రణాళిక సిద్ధం చేయాల్సిన అవసరాన్ని వివరించిన కలెక్టర్, రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో మురుగు కాల్వల శుభ్రత, పరిసరాల పరిశుభ్రత, నీటి సంరక్షణ చర్యలు, కమ్యూనిటీ సోక్‌పిట్ల నిర్మాణం వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.వరదల సమయంలో ప్రజలు ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించి లోతట్టు ప్రాంతాల నుంచి వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు. భారీ వర్షాల కారణంగా ఇండ్లు కూలి పోవడం, విద్యుత్ స్తంభాలు, పెద్ద చెట్లు కూలిపోవడం వంటి ఘటనలతో ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉందన్నారు. రహదారులు, కల్వర్టులపై వరద నీరు ప్రవహిస్తున్న సమయంలో అధికారుల హెచ్చరికలను పట్టించుకోకుండా ప్రయాణించడం వల్ల ప్రమాదాలు జరుగు తున్నాయని తెలిపారు. ప్రమాదకర పరిస్థితుల్లో సెల్ఫీలు తీసుకోవడం కూడా ప్రాణాపాయానికి దారితీస్తుందని హెచ్చరించారు.పాతబడిన ఇళ్లలో నివసించే వారు భారీ వర్షాల సమయంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలు లేదా ఇతర సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. వరదల సమయంలో అనవసరంగా బయటకు వెళ్లవద్దని, విపత్కర పరిస్థితుల్లో హీరో అవ్వాలని ప్రయత్నించవద్దని హితవు పలికారు.ఎస్.ఐ.ఆర్ కార్యక్రమం ద్వారా ఓట్లు తొలగిపోతాయనే ప్రచారం పూర్తిగా అపోహ మాత్రమేనని కలెక్టర్ స్పష్టం చేశారు. స్వాతంత్ర్యం అనంతరం పలుమార్లు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించారని, ఓటరు జాబితా శుద్ధీకరణే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని, మరణించిన వారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు, డూప్లికేట్ ఓట్లు మాత్రమే తొలగిస్తామని చెప్పారు. అర్హత ఉన్న ఒక్క ఓటరు కూడా తన ఓటు హక్కును కోల్పోరని భరోసా కల్పించారు.జూన్ 25 నుంచి జూలై 24 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి మిగిలిన ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలు అందజేస్తారని తెలిపారు. ప్రజలు తమ వివరాలను నమోదు చేసి ప్రభుత్వం గుర్తించిన 11 గుర్తింపు పత్రాల్లో ఏదో ఒక దానిని జతచేసి సమర్పించాలని సూచించారు.జూలై 31, 2026న డ్రాఫ్ట్ ఎస్.ఐ.ఆర్ ఓటరు జాబితా విడుదల చేస్తామని తెలిపారు. ప్రతి ఓటరు తన పేరు డ్రాఫ్ట్ జాబితాలో ఉందో లేదో పరిశీలించాలని, అభ్యంతరాలు, ఫిర్యాదులు, కొత్త క్లెయిమ్‌లు ఉంటే ఆగస్టు 30లోగా సమర్పించాలని సూచించారు.జూలై 1, 1987కు ముందు భారతదేశంలో జన్మించిన వారు తమ స్వీయ గుర్తింపు లేదా జనన ఆధార పత్రాలు సమర్పిస్తే సరిపోతుందని, జూలై 1, 1987 నుంచి డిసెంబర్ 2, 2004 మధ్య జన్మించిన వారు తమ పత్రాలతో పాటు తండ్రి లేదా తల్లి ఎవరి అయినా ఒకరి పత్రం సమర్పించాలని తెలిపారు.డిసెంబర్ 2, 2004 తర్వాత జన్మించిన వారు తండ్రి, తల్లి ఇద్దరి పత్రాలు సమర్పించాల్సి ఉంటుందని వివరించారు.సెప్టెంబర్ 28, 2026 నాటికి అన్ని అభ్యంతరాలు, క్లెయిమ్‌లను పరిష్కరించి, అక్టోబర్ 1, 2026న తుది ఓటరు జాబితా ను విడుదల చేస్తామని జిల్లా కలెక్టర్ వెల్లడించారు.ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ బి జ్యోతి, ఆత్మ పిడి బి.సరిత, ఏవో ఉమా నగేష్, పశువైద్యులు జగ్గులాల్ సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.




# వైసీపీ ఆరోపణలు వాస్తవాలకు విరుద్ధం

## టీడీపీ నాయకుల మండిపాటు




పెనమలూరు, జూన్ 4 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) వెన్నుపోటు రాజకీయాల గురించి మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదని,ఆ విషయంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చరిత్రే సాక్ష్యమని తాడిగడప మున్సిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు,రాష్ట్ర గౌడ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరామప్రసాద్ గౌడ్,రాష్ట్ర అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్, దేవోలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పీత గోపీచంద్, ఎ. ఎం. సి. చైర్మన్ కొండా ప్రవీణ్, పెనమలూరు మండల తెదేపా అధ్యక్షులు కోయ ఆనంద్ ప్రసాద్ లు విమర్శించారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ "ఒక్క అవకాశం" అంటూ అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి, ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అభివృద్ధి మార్గం నుంచి పక్కదారి పట్టించి అన్ని రంగాల్లో వెనక్కి నెట్టారని ఆరోపించారు, ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకుండా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడంతో పాటు యువత, రైతులు, ఉద్యోగులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. వెన్నుపోటు రాజకీయాల గురించి మాట్లాడే ముందు తమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చక్రవర్తిని అడిగి తెలుసుకోవాలని సూచించారు. గతంలో తమ పార్టీ అభ్యర్థులను నమ్మించి వెన్నుపోటు పొడిచిన ఘటనలు ప్రజలకు బాగా తెలుసని అన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి విషయంలో కూటమి ప్రభుత్వం ఎలాంటి రాజకీయ, కుల, మత భేదాలు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సహాయం అందిస్తోందని తెలిపారు. పెనమలూరు నియోజకవర్గంలో గత రెండేళ్లలో 1,790 మందికి రూ.18 కోట్లకు పైగా ముఖ్యమంత్రి సహాయనిధి అందజేశామని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కనీసం తమ పార్టీ కార్యకర్తలకు సైతం ఇలాంటి సహాయం అందలేదని విమర్శించారు.తమ పార్టీకి చెందిన వారితో పాటు వైసీపీ అనుచరులకు కూడా సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించామని, సహాయం కోసం వచ్చిన వారిని రాజకీయ కోణంలో చూడలేదని స్పష్టం చేశారు. "కాలు పట్టుకుంటేనే చెక్కులు ఇచ్చాం" అనే ఆరోపణలను నిరూపించే ధైర్యం వైసీపీ నాయకులకు ఉందా అని ప్రశ్నించారు.వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డిదేనని ఆరోపించారు. ఆరోగ్యశ్రీ బిల్లులు చెల్లించాలని కోరిన ఆసుపత్రులపై కేసులు నమోదు చేసి వైద్య రంగాన్ని భయభ్రాంతులకు గురిచేశారని అన్నారు. రైతు బజార్లపై వైసీపీ నాయకులు చేస్తున్న విమర్శలను కూడా ఖండించారు,రైతులకు, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే ఉద్దేశంతో ఖాళీ స్థలాలను అభివృద్ధి చేసి రైతు బజార్లు ఏర్పాటు చేశామని తెలిపారు,ఒక్క రూపాయి కూడా వసూలు చేయకుండా వేలాది కుటుంబాలకు ఉపాధి అవకాశాలు కల్పించడం తప్పా అని ప్రశ్నించారు.డీఎస్సీ నియామకాలపై మాట్లాడే అర్హత కూడా వైసీపీకి లేదని అన్నారు,వైసీపీ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ పేరుతో యువతను మోసం చేసిందని,ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో జీతాలు కూడా ఇవ్వలేకపోయిందని విమర్శించారు,తమ హయాంలో ఉద్యోగ అవకాశాలు,పెట్టుబడులు,అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా అమలవుతున్నాయని పేర్కొన్నారు.జగన్మోహన్ రెడ్డి పాలనలో ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టడం,వేధింపులకు గురిచేయడం, ప్రజాస్వామ్యాన్ని అణచివేయడం జరిగిందని ఆరోపించారు,ఆ ఐదేళ్ల విధ్వంసకర పాలన కారణంగా రాష్ట్ర అభివృద్ధి కనీసం పదేళ్లు వెనక్కి వెళ్లిందన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాజధాని అమరావతి, పోలవరం వంటి కీలక ప్రాజెక్టులు మళ్లీ వేగం అందుకున్నాయని తెలిపారు,అదే విధంగా పెనమలూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ఆధ్వర్యంలో రూ.250 కోట్లకు పైగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఈ అభివృద్ధిని చూసి ఓర్వలేకే వైసీపీ నాయకులు నిరాధార ఆరోపణలకు దిగుతున్నారని మండిపడ్డారు.రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ చేపడుతున్న "వెన్నుపోటు" కార్యక్రమం అసలు వెన్నుపోటు గురించి కాదు,వారి ఐదేళ్ల విధ్వంస పాలనను ప్రజలు గుర్తు చేసుకునే కార్యక్రమంగా మారిందని వ్యాఖ్యానించారు. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయి రాజకీయంగా పతనమైన పార్టీగా వైసీపీ చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు.దళితులు, బడుగు బలహీన వర్గాలు,యువత, రైతులు,మహిళలు ఇలా ప్రతి వర్గానికీ వైసీపీ పాలనలో అన్యాయం జరిగిందని ఆరోపించారు. ముఖ్యంగా దళిత విద్యార్థుల విదేశీ విద్య కోసం చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన అంబేద్కర్ విదేశీ విద్య పథకాన్ని నిర్వీర్యం చేయడం ద్వారా దళిత యువత భవిష్యత్తును దెబ్బతీశారని విమర్శించారు.ఎమ్మెల్యే బోడే ప్రసాద్ పై వ్యక్తిగత విమర్శలు చేస్తే పార్టీ అధినేత నుంచి గుర్తింపు వస్తుందనే భ్రమలో కొందరు వైసీపీ నాయకులు ఉన్నారని అన్నారు,అయితే ప్రజల మధ్య సేవా కార్యక్రమాలు,అభివృద్ధి పనులు,సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు సాగుతున్న బోడే ప్రసాద్ ప్రతిష్ఠను ఎవరూ దెబ్బతీయలేరని స్పష్టం చేశారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించడంతో పాటు,సొంత నిధులతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు అండగా నిలుస్తూ,రైతు బజార్లలో దుకాణాలు, తోపుడు బండ్లు,బడ్డీలు అందజేసి వందలాది కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్ పై స్వార్థ రాజకీయాల కోసం అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని వైసీపీ నాయకులకు హెచ్చరించారు,ప్రజా సేవ, అభివృద్ధి, సంక్షేమమే తమ లక్ష్యమని, నిరాధార ఆరోపణలతో ఆ ప్రయాణాన్ని ఎవరూ అడ్డుకోలేరని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, మధు రామకృష్ణ ఎస్సీ సెల్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నిజామాబాద్ లో 'రెసోనెన్స్ ఫౌండేషన్ సెంటర్' ప్రారంభం

### క్రమశిక్షణ,సరైన మార్గదర్శకత్వం విజయానికి మూలం
### మాజీ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ




నిజామాబాదు జిల్లా ప్రతినిధి చిలుక విజయకుమార్ జూన్ 04 నేటి శుభోదయ :క్రమశిక్షణ,సరైన మార్గదర్శకత్వం విజయానికి మూలమని మాజీ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ తెలిపారు.దేశంలో ఐఐటీ-జేఈఈ,నీట్ శిక్షణలో అగ్రగామిగా ఉన్న రెసోనెన్స్ విద్యాసంస్థలు నిజామాబాదులో ఉన్న హోటల్ వంశీ ఇంటర్నేషనల్ వేదికగా 'రెసోనెన్స్ ఫౌండేషన్ సెంటర్'ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించింది.మాజీ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరై ఈ కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే బలమైన విద్యా పునాది నిర్మించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.నిజామాబాదులో ఫౌండేషన్ కోచింగ్ ను అందుబాటులోకి తీసుకు వస్తున్న రెసోనెన్స్ విద్యా సంస్థలను అభినందించారు.6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.ఈ సందర్భంగా రెసోనెన్స్ మేనేజింగ్ డైరెక్టర్ పూర్ణచంద్రరావు నర్రా మాట్లాడుతూ.... అనుభవజ్ఞులైన అధ్యాపకులు, క్రమబద్ధమైన బోధనా పద్ధతులు, నిరంతర విద్యా పర్యవేక్షణతో ఫలితాల ఆధారిత విద్యను అందించడానికి రెసోనెన్స్ కట్టుబడి ఉందన్నారు.ఈ ఫౌండేషన్ సెంటర్ విద్యార్థులకు ప్రాథమికాంశాలను బలోపేతం చేసుకోవడానికి, ఐఐటీ -జేఈఈ, నీట్, ఒలింపియాడ్స్ వంటి పోటీ పరీక్షలకు ఆత్మవిశ్వాసంతో సిద్ధమవడానికి సహాయపడుతుందని తెలిపారు.అనంతరం నిర్వహించిన అవగాహన సదస్సులో ప్రారంభ దశలోనే ప్రిపరేషన్ మొదలుపెట్టడం, సంపూర్ణ అవగాహనతో కూడిన అభ్యాసం, కెరీర్ ఆధారిత విద్యా ప్రణాళిక ప్రాముఖ్యతను వివరించారు.




### రెసోనెన్స్ విద్యాసంస్థలు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్

రెసోనెన్స్ అనేది ఐఐటీ మద్రాస్ పూర్వ విద్యార్థి ఆర్కే వర్మ 2001లో రాజస్థాన్ కోటాలో స్థాపించారు.ఇది దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఒక ప్రతిష్టాత్మక విద్యాసంస్థ,గత రెండు దశాబ్దాలుగా రెసోనెన్స్ 87 నగరాల్లోని 150 పైగా కేంద్రాల ద్వారా 10 లక్షల (1 మిలియన్) పైగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చింది. ఇందులో 3.3 లక్షల పైగా విద్యార్థులు ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, ప్రముఖ సాంకేతిక విశ్వవిద్యాలయాలు,టాప్ మెడికల్ కాలేజీలలో ప్రవేశాలు పొందారు. దేశవ్యాప్తంగా ఉన్న ఈ బలమైన వారసత్వంతో, పూర్ణచంద్రరావు నర్రా దూరదృష్టితో కూడిన నాయకత్వంలో రెసోనెన్స్ 2018లో హైదరాబాద్లో ఒకే ఒక్క క్యాంపస్ ప్రస్థానాన్ని ప్రారంభించింది.ఎంపీసీ,బైపీసీ గ్రూపులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ.. ఐఐటీ -జేఈఈ,నీట్, ఇతర పోటీ పరీక్షలకు సమగ్రమైన శిక్షణ, అనుభవజ్ఞులైన అధ్యాపకులు ,క్రమశిక్షణతో కూడిన ప్రిపరేషన్ ,ఫలితాల ఆధారిత విధానంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో నిరంతర విజయాలకు, విద్యా నైపుణ్యానికి రెసోనెన్స్ విద్యాసంస్థలు ఒక చిహ్నంగా మారాయి. కేవలం ఏడు సంవత్సరాలలోనే,రెసోనెన్స్ విద్యాసంస్థలకు చెందిన 6,100 పైగా విద్యార్థులు ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు,ఎయిమ్స్,ఇతర అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాలలో సీట్లు సాధించారు.ఈ అద్భుతమైన విజయాల స్ఫూర్తితో రెసోనెన్స్ ఇప్పుడు ఫౌండేషన్ సెంటర్లు, పాఠశాలలు, ఈ-లెర్నింగ్,గ్లోబల్ స్టడీస్ రంగాలలోకి విస్తరించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా 50 పైగా క్యాంపస్లతో విజయవంతంగా దూసుకుపోతోందన్నారు. ఈ కార్యక్రమంలో 'రెసోనెన్స్ ఫౌండేషన్ సెంటర్' అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం



విజయవాడ, జూన్ 4 (నేటి శుభోదయ):- ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నేటి ఉదయం 9.00 గంటలకు కృష్ణలంకలోని ఏపీఎస్ఆర్ఎం స్కూల్ ప్రాంగణం, దేవి నగర్, కొత్తపేట లో మొక్కల నాటే కార్యక్రమం నిర్వహించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు గురువారం కార్యక్రమ స్థలాన్ని కమిషనర్, అధికారులతో కలిసి సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేసే విధంగా కార్యక్రమాన్ని నిర్వహించాలని, ఎక్కువ సంఖ్యలో మొక్కలు నాటి నగరంలో హరిత వాతావరణాన్ని పెంపొందించే దిశగా చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పర్యావరణ ప్రేమికులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనేలా సమన్వయం చేయాలని ఆదేశించారు. అదేవిధంగా నాటిన మొక్కల సంరక్షణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, మొక్కలు పెరిగే వరకు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమానికి హాజరయ్యే వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, పారిశుద్ధ్యం, వేదిక, కూర్చునే ఏర్పాట్లు తదితర మౌలిక సదుపాయాలను సమకూర్చాలని ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, పచ్చని వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కమిషనర్ ధ్యానచంద్ర పిలుపునిచ్చారు. ఈ పర్యటనలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి. చంద్రశేఖర్, జోనల్ కమిషనర్ కే షమ్మీ, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్ బాబు, ఇన్చార్జ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామారావు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ అన్నపూర్ణ డాక్టర్ గోపాల నాయక్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజారోగ్య సేవలు, పారిశుద్ధ్య నిర్వహణ, వర్షాకాల సన్నద్ధతపై సమగ్ర సమీక్ష సమావేశాన్ని నిర్వహించిన వీఎంసి కమిషనర్ ధ్యానచంద్ర



విజయవాడ, జూన్ 4 (నేటి శుభోదయ):- విజయవాడ నగరపాలక సంస్థ ప్రజారోగ్య శాఖ ప్రధాన కార్యాలయంలోని నూతన భవనంలో గల సమావేశ మందిరంలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు ఆధ్వర్యంలో ప్రజారోగ్య శాఖ అధికారులతో, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని తమ ఛాంబర్ నుండి కమిషనర్ ధ్యానచంద్ర వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొని ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం, వర్షాకాల సన్నద్ధతకు సంబంధించిన పలు అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో నగర పారిశుద్ధ్య నిర్వహణ, శానిటేషన్ కార్యకలాపాలు, మానవ వనరుల వినియోగం, పారిశుద్ధ్య వాహనాల పనితీరు, డోర్-టు-డోర్ చెత్త సేకరణకు సంబంధించిన మైక్రో పాకెట్ మ్యాపింగ్, లాజిస్టిక్ మ్యాపింగ్, చెత్త ఉత్పత్తి, సేకరణ వ్యవస్థ, లోడర్ పాయింట్లు, కాంపాక్టర్ బిన్ల నిర్వహణ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రతి వార్డు పరిధిలో పారిశుద్ధ్య సేవలు సమర్థవంతంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగరంలోని ప్రధాన, ఉప కాలువల పూడికతీత పనుల పురోగతిని సమీక్షించారు. వర్షపు నీరు నిల్వ కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, మాన్సూన్ యాక్షన్ ప్లాన్‌ను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన యంత్రాంగం, సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని సూచించారు. అలాగే నగరంలోని గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్ల (+టూ) పనితీరు, ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు--2026 అమలు స్థితి, చెత్త సేకరణ, తరలింపు ప్రక్రియలను సమీక్షించారు. వ్యర్థాల నిర్వహణలో శాస్త్రీయ విధానాలను అనుసరిస్తూ నగర పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. వెక్టర్ బోర్న్ డిసీజ్ కంట్రోల్ ప్రోగ్రామ్ (ఎదీణజూ) కింద చేపడుతున్న దోమల నివారణ చర్యలు, యాంటీ లార్వా ఆపరేషన్లు, ఫాగింగ్ కార్యక్రమాలు, సీజనల్ వ్యాధుల నివారణ చర్యలపై కూడా సమీక్ష నిర్వహించారు. ప్రజల్లో అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. పశువైద్య విభాగం నిర్వహిస్తున్న కార్యకలాపాలు, వీధి జంతువుల నియంత్రణ, ప్రజారోగ్య పరిరక్షణకు సంబంధించిన చర్యలపై కూడా చర్చించారు. నగరంలో ప్రజారోగ్య ప్రమాణాలను మరింత మెరుగుపరచేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ గోపాల నాయక్, శానిటరీ సూపర్వైజర్లు, ఇన్స్పెక్టర్లు, పాల్గొన్నారు.

## రెవెన్యూ సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించి పట్టాలు ఇస్తాం

**రెవెన్యూ, కార్పొరేషన్ అధికారులతో కలిసి పర్యటించిన ఎమ్మెల్యే గద్దె**



విజయవాడ, జూన్ 4 (నేటి శుభోదయ):- తూర్పులోని 2వ డివిజన్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించి స్థల యజమానుల పేరుతో రిజిస్ట్రేషన్ జరిగేలా చర్యలు తీసుకుంటామని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. గురువారం ఉదయం తూర్పులోని 2వ డివిజన్‌లో ఎమ్మెల్యే గద్దె, రెవెన్యూ, కార్పొరేషన్ అధికారులతో కలిసి పర్యటించారు. స్థానికులను అడిగి సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. రెవెన్యూ సమస్యపై అక్కడి భూ యజమానుల దగ్గర ఉన్న రికార్డులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా ఇక్కడ భూ-యజమానులకు చెందిన స్థలాలు వారి పేరుతో రిజిస్ట్రేషన్లు కాకపోవడం వల్ల యజమానులు చాలా ఇబ్బందులు పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని తెలిపారు. స్థలాల విషయంలో యజమానులకు ఏవిధమైన ఇబ్బందులు ఉండకూడదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారులకు చాలా స్పష్టంగా చెప్పారని గుర్తు చేశారు. ఆయన ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులతో కలిసి తాను ఈ ప్రాంతంలో పర్యటిస్తున్నానని చెప్పారు. ఇక్కడి యజమానులతో మాట్లాడి వారి దగ్గర ఉన్న భూ-రికార్డులను కూడా స్వయంగా పరిశీలించానని చెప్పారు. ఈ ప్రాంతానికి చెందిన పాతకాలం నాటి భూ-రికార్డులు ఒక రైతు వద్ద ఉన్నాయని, ఆయన అందుబాటులో లేకపోవడంతో శుక్రవారం ఉదయం మళ్ళీ ఈ ప్రాంతానికి వచ్చి ఆ భూ- రికార్డులను పరిశీలిస్తామని తెలిపారు. ఆ రికార్డులను అధికారులు కూడా పరిశీలించి యజమానులకు ఏవిధమైన ఇబ్బంది లేకుండా పూర్తి స్థాయి హక్కులతో వారి పేరుతో రిజిస్ట్రేషన్ చేసేందుకు తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వివరించారు. ఇక్కడి సమస్యను తాను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్ళి అవసరమైతే క్యాబినెట్‌లో కూడా చర్చించి అందరికీ న్యాయం జరిగే విధంగా చూస్తానని ఎమ్మెల్యే గద్దె హామీ ఇచ్చారు. త్వరలోనే ఈ విషయాన్ని ఫైనల్ చేసి కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి పంపి వీలైనంత త్వరగా యజమానుల పేరుతో వారి స్థలాలు రిజిస్ట్రేషన్ అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమస్యను పరిష్కరించగలమనే నమ్మకం తమకు ఉందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రంలోని ప్రతి భూమికి రికార్డు ఉండాలని చాలా స్పష్టంగా అధికారులకు ఆదేశాలు ఇచ్చారని, అందువల్ల సాధ్యమైనంత త్వరగా ఈ సమస్యను పరిష్కరిస్తామని గద్దె చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దాసరి గాబ్రియేల్, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ, సొగసాని రత్నశ్రీ, కృష్ణప్రసాద్, దొమకొండ రవికుమార్, ఈతకొండ, షేక్ షకీలా బేగం, ముత్యాల కృష్ణ, అనుముల పూర్ణ, పడాల గంగాధర్, దుర్గారావు, నాగుల్ మీరా, తహసీల్దార్ రోహిణీదేవి, సర్వే విభాగం ఏ.డీ. మోహన్‌రావు, లక్ష్మి దుర్గ తదితరులు పాల్గొన్నారు.

## అమరజీవి వంగవీటి మోహనరంగా విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన

**డిసెంబర్ 26 వర్ధంతి నాటికి విగ్రహ ఆవిష్కరణకు చర్యలు: ఎమ్మెల్యే బొండా**



విజయవాడ, జూన్ 4 (నేటి శుభోదయ):- విజయవాడ పోలీస్ కంట్రోల్ రూమ్ ఎదురుగా ఉన్న స్క్రాప్ పార్క్ ప్రాంతంలో విజయవాడ మున్సిపల్ కౌన్సిల్ ఆమోదించిన స్వర్గీయ శ్రీ వంగవీటి మోహనరంగా రావు విగ్రహ ఏర్పాటు ప్రతిపాదిత స్థలాన్ని ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొండా ఉమా మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవం కోసం జీవితాంతం పోరాడి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానేత స్వర్గీయ వంగవీటి మోహనరంగా అని, సామాన్య ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. రంగా కేవలం ఒక రాజకీయ నాయకుడు మాత్రమే కాదని, అణగారిన వర్గాల ఆశాజ్యోతి, ప్రజా హక్కుల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. నిరాహార దీక్ష చేస్తూ ప్రజల సమస్యలపై తన ప్రాణాలను అర్పించిన త్యాగధనుడిగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని ఉమా అన్నారు. విజయవాడ నగరానికి, ముఖ్యంగా తూర్పు నియోజకవర్గ ప్రజలకు రంగా తో విడదీయరాని అనుబంధం ఉందని, ఆయన పోరాట స్ఫూర్తి తరతరాలకు తెలియజేయాలనే ఉద్దేశంతో ప్రజలందరికీ అందుబాటులో ఉండే ప్రాంతంలో విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ మేరకు విజయవాడ మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం ఆమోదం పొందడం ఆనందదాయకమని ఉమా పేర్కొన్నారు. రంగా విగ్రహం కేవలం ఒక శిల్పం కాదని, అది పేద ప్రజల హక్కుల కోసం జరిగిన పోరాటానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. భవిష్యత్ తరాలు ఆయన సేవలను, త్యాగాలను గుర్తు చేసుకునేలా ఈ విగ్రహం స్ఫూర్తి కేంద్రంగా నిలుస్తుందని ఉమా తెలిపారు. త్వరలోనే భూమిపూజ కార్యక్రమం నిర్వహించి విగ్రహ నిర్మాణ పనులను ప్రారంభిస్తామని, డిసెంబర్ 26న జరిగే వంగవీటి మోహనరంగా వర్ధంతి నాటికి విగ్రహాన్ని పూర్తి చేసి ప్రజలకు అంకితం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని వెల్లడించారు. వంగవీటి మోహనరంగా ఆశయాలు, సిద్ధాంతాలు, ప్రజాసేవా తత్వాన్ని ముందుకు తీసుకెళ్లడం ప్రతి అభిమాని బాధ్యత అని పేర్కొన్న బొండా ఉమా రంగా ఆశయ సాధన కోసం ఆయన అనుచరులు, అభిమానులతో కలిసి నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మా మిత్ర మండలి నాయకులు చింతల రామారావు (బాబి), చింతల రవికుమార్ (చంటి), నవనీతం సాంబశివరావు, అడపాల కృష్ణాజి, దర్శి వాసు, గుజ్జల అమర్, లంక వెంగళరావు యాదవ్, బాడిద శంకర్, బుల్ల విజయ్ కుమార్, వంగవీటి మోహన రంగా అభిమానులు, అనుచరులు, బొండా ఉమన్న అభిమానులు విగ్రహ ఏర్పాటు చేయనున్న ప్రాంతం, ప్రజలకు అందుబాటు, ట్రాఫిక్ సౌకర్యాలు, భవిష్యత్ అభివృద్ధి అవకాశాలపై సమగ్రంగా పరిశీలించారు.

## జూన్ 15 నుండి జూలై 14 వరకు ప్రతి ఒక్క ఓటర్ ప్రక్రియ ద్వారా నమోదు చేసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**: ఎమ్మెల్యే బొండా ఉమా**




విజయవాడ, జూన్ 4 (నేటి శుభోదయ):- సెంట్రల్ అజిత్ సింగ్‌నగర్ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ సెంట్రల్ నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, యూనిట్ ఇన్చార్జిలతో సమావేశాన్ని ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ రాష్ట్రం లో ఎన్నికల సంఘం చేపడుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం ప్రతి అర్హుడైన పౌరుడికి ఓటు హక్కు కల్పించడం, అనర్హులు , డూప్లికేట్ ఓట్లను, డబుల్ ఎంట్రీలను తొలగించడమే లక్ష్యంగా నిర్వహించబడుతోందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జూన్ 15 నుండి జూలై 14 వరకు ఇంటింటి సర్వే కార్యక్రమం నిర్వహించబడుతుందని, ఈ కార్యక్రమంలో బూత్ లెవల్ అధికారులు (దీూాలు), రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు పాల్గొంటారని, ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు నమోదు కావడంతో పాటు ఎలాంటి పొరపాట్లు జరగకుండా ప్రజలు పూర్తి సహకారం అందించాలని, ప్రజలు తమకు సంబంధించిన వివరాలను సరైన పత్రాలతో సమర్పించాలని, అవసరమైన ఫారాలు, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, ఇతర ధ్రువీకరణ పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఉమా సూచించారు. ఓటరు జాబితా ముసాయిదా విడుదలైన అనంతరం అభ్యంతరాలు లేదా సవరణలు ఉంటే వాటిని నిర్ణీత గడువులోగా తెలియజేసే అవకాశం కూడా కల్పించబడుతుందని తెలిపారు. కొన్ని రాజకీయ పార్టీలు ఈ ూ×= పై అసత్య ప్రచారాలు చేస్తున్నాయని, ప్రజలు అలాంటి తప్పుడు ప్రచారాలను నమ్మి అపోహలకు గురికావద్దని, ఓటరు జాబితా సవరణ పూర్తిగా పారదర్శకంగా, రాజ్యాంగబద్ధంగా జరుగుతున్న ప్రక్రియ అని చెప్పారు. సెంట్రల్ లోని ప్రతి ఇంటికి అధికారులు, బూత్ లెవల్ ఏజెంట్లు చేరుకునేలా పార్టీ క్లస్టర్, యూనిట్, భూత్ ఇన్చార్జులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు, ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో నమోదు కావడం ప్రజాస్వామ్య బలోపేతానికి ఎంతో అవసరమని ఉమా పేర్కొన్నారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాసరి ఉదయశ్రీ, సెంట్రల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ నవనీతం సాంబశివరావు, ఘంటా కృష్ణమోహన్ పాల్గొన్నారు.

## గన్నవరం అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సమీక్ష

**-విజయవాడ కార్యాలయంలో ఇంజినీరింగ్ శాఖల అధికారులతో సమావేశం**

**-నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యం.**

**అభివృద్ధి పనుల్లో వేగంతో పాటు నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని సూచన**



విజయవాడ, జూన్ 4 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) గన్నవరం నియోజకవర్గ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడమే లక్ష్యంగా ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు గురువారం విజయవాడలోని తన కార్యాలయంలో వివిధ ఇంజినీరింగ్ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, పెండింగ్‌లో ఉన్న పనులు, కొత్తగా చేపట్టాల్సిన పనులను శాఖల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా రహదారులు, డ్రైనేజీలు, ప్రభుత్వ భవనాల నిర్మాణాల సంబంధించిన పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన పనులను ప్రాధాన్యత క్రమంలో గుర్తించి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న పనులపై ప్రత్యేక దృష్టి సారించి, వాటిని నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అభివృద్ధి పనుల్లో జాప్యానికి తావులేకుండా పనుల వేగం పెంచాలని, అదే సమయంలో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడవద్దని స్పష్టం చేశారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి వెంటనే స్పందించాలని సూచించారు.

## కింజారపు అచ్చం నాయుడుకి మార్కెట్ యార్డు లోని పలు అభివృద్ధి పనుల కొరకు వినతి పత్రం అందజేత



విజయవాడ, జూన్ 4 (నేటి శుభోదయ):- ఆంధ్రప్రదేశ్ ఏఎంసీ చైర్మన్ ల సంఘం ఆధ్వర్యంలో వ్యవసాయ, మార్కెటింగ్ శాఖమంత్రి కింజారపు అచ్చం నాయుడు ని మర్యాదపూర్వకంగా కలిసి చైర్మన్ ల డిమాండ్లను వివరించారు. మైలవరం ఏఎంసి చైర్మన్ శ్రీమతి పొనకళ్ళ నవ్యశ్రీ మైలవరం మార్కెట్ యార్డు పరిధిలో గల మూడు మండలాలలో అంతర్గత రహదారులు-లింకు రోడ్డు లు, మైలవరం మార్కెట్ యార్డు ఆవరణలో పలు అభివృద్ధి పనులకు నిధులను మంజూరు చేయాలని వినతి పత్రం అందజేసారు. ఈ కార్యక్రమంలో పలువురు ఏఎంసి చైర్మన్లు, జనసేన పార్టీ మైలవరం మండల అధ్యక్షులు శీలం బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బాలు జయంతి వేడుకలు

**- సినీ సంగీత విభావరి**




ఒంగోలు, నేటి శుభోదయ ::: గాన గంధర్వుడు పండితారాధ్యుల బాలసుబ్రమణ్యం 80వ జయంతి సందర్భంగా బాలు కళా సమితి ఆధ్వర్యంలో స్థానిక సీ.వి.ఎన్. రీడింగ్ రూమ్ లో బాలూ పాటలతో నిర్వహించిన సినీ సంగీత విభావరి వీనుల విందు చేసింది. ముందుగా ఎస్పీ బాలసుబ్రమణ్యం చిత్రపటానికి సి.వి.ఎన్ రీడింగ్ రూమ్ సెక్రటరీ రాధాకృష్ణ, గాయని గాయకులు, కళాకారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బాలు తన సినీ ప్రయాణంలో 16 భాషల్లో 40 వేలకు పైగా పాటలు పాడి పద్మ విభూషణ్ లాంటి అత్యుత్తమ పురస్కారాన్ని అందుకోవడమే కాకుండా ఆరు జాతీయ అవార్డులను అందుకున్నారని బాలూ కళా సమితి అధ్యక్షులు పోలవరపు అజయ్ బాబు అన్నారు. గాయనీ గాయకులు రసూల్ (విజయవాడ), శ్రీమతి వీణ (హైదరాబాద్), మనోహర్ (ఒంగోలు), పూర్ణిమ (ఒంగోలు) ఆలపించిన గీతాలు ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశాయి. కీబోర్డుపై నరసింహ, ఫ్లూట్ పై కోటి, రిథంపాడ్ పై సాగర్, వాద్య సహకారం అందించారు. పెద్ద సంఖ్యలో ప్రేక్షకులు పాల్గొని చక్కటి సంగీత విభాగం ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు.

## పెందుర్తి , ప్రశాంతినగర్ ఏరియా లో ఒక ఇంటోలో పోయిన సుమారు 15 తులాల బంగారం

**వస్తువులను గుర్తించి పిర్యాదురాలుకి అప్పగించడమైనది**



( నేటి శుభోదయ జూన్ : 05 జగన్ ) విశాఖపట్నం, పెందుర్తి, ప్రశాంతి నగర్ ఏరియా కు చెందిన ఫిర్యాదిరాలు అయిన కరుకోలా గోపమ్మ, ఔ/శీ వైకుంట రావు, అను ఆమె ఈ దినం 11:00 గం,, కు బంగారు వస్తువులు తీసుకొని పులగానిపాలెం జంక్షన్ లో ఉన్న ఎస్బిఐ బ్యాంక్ కి గోల్డ్ లోన్ తీసుకుందామని పట్టుకొని వెళ్ళి లోన్ కు సరిపడా వస్తువులు బ్యాంక్ వాళ్ళు తీసుకోని మిగిలిన 15 తులాలు వస్తువులు తనకి ఇవ్వగా ఆ వస్తువులు తీసుకొని ఇంటికి వెళ్లిపోయినాను అని ఇంటి లో షోఫా లో పెట్టి మెడపైకి వెళ్ళి మిరపకాయలు ఆరబెట్టుటకు వెళ్ళి తిరిగి వచ్చి చూడగా కనిపించలేదు అని 112 కాల్ పిర్యాదు అంశములు. విశాఖపట్నం సిటీ పోలీస్ కమీషనర్ శ్రీ శంకబ్రాత బాగ్చి ఐపీస్ వారి ఆదేశాల మేరకు శ్రీమతి కే . లతా మాధురి ఐపీస్ డీసీపీ క్రైమ్స్ , , జి .భవ్య రెడ్డి , ఏసీపీ - క్రైమ్స్ వార్ల పర్యవేక్షణలో వెస్ట్ సబ్-డివిజన్ ఇన్ ఛార్జ్ క్రైమ్ ఇన్స్పెక్టర్ శ్రీ ఎం .నాగేశ్వర రావు వారి అద్వర్యం లో ఇన్చార్జి డి ఎస్



ఐ . జి .విజయ్ కుమార్ వెంటనే స్పందించి తన సిబ్బంది ఏసై శ్రీనివాసరావు , హెచ్ సీ నాగరాజు వెళ్ళి పిర్యాదితో క్షుణ్ణంగా మాట్లాడి విచారించి సదరు ఆమె మరియు సిబ్బంది కలసి ఇల్లంతా వెతికించగా కిచెన్ రూమ్ లో ఫ్రిడ్జ్ వెనుక సదరు వస్తువులు ఉన్నట్లు గుర్తించి సదరు వస్తువులుకి పిర్యాదురాలుకి అప్పగించడమైనది. సదరు పిర్యాదురాలు పోలీస్ వారు వెంటనే స్పందించినందుకు పోలీస్ వారికి ధన్యవాదాలు తెలియపర్చినారు.

## ఆపరేషన్ క్లీన్ స్వీప్ విజయవంతానికి ప్రజల భాగస్వామ్యం అవసరం

**జీవీఎంసీ పెందుర్తి జోన్ జోనల్ కమిషనర్ హెచ్. శంకరరావు..**




( నేటి శుభోదయ జూన్ : 05 జగన్ విశాఖపట్నం ) రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా నిర్వహిస్తున్న "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని జీవీఎంసీ పెందుర్తి జోన్ జోనల్ కమిషనర్ హెచ్. శంకరరావు పేర్కొన్నారు. గురువారం పెందుర్తి జోన్ పరిధిలోని వార్డు నెం.96 ఆదిత్యనగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (=ఔూ) ఆధ్వర్యంలో ఆపరేషన్ క్లీన్ స్వీప్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నివాసితులకు ఇంటింటి చెత్త సేకరణ, మూలస్థాయిలో తడి--పొడి వ్యర్థాల విభజన, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతి కుటుంబం వ్యర్థాలను నాలుగు రకాల డస్ట్ బిన్లలో విభజించి పారిశుద్ధ్య కార్మికులకు నిత్యం అందించాలని, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా పరిశుభ్రమైన కాలనీల నిర్మాణానికి సహకరించాలని కోరారు. పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించి దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. అలాగే స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26లో విశాఖ నగరం దేశంలోనే అగ్రగామి పరిశుభ్ర నగరంగా నిలిచేలా ప్రజలు తమ వంతు సహకారం అందించాలని, ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని స్వచ్ఛ విశాఖ లక్ష్యంగా నగర పరిశుభ్రత, సుందరీకరణకు తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో, శానిటరీ సూపర్వైజర్ కె.వి. రమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వి.ఎస్. నాయుడు, కమ్యూనిటీ ఆర్గనైజర్ ప్రవీణ్, ఆదిత్యనగర్ ఆర్‌డబ్ల్యూఏ అధ్యక్షుడు కార్యదర్శి శివశంకర్, పారిశుద్ధ్య సిబ్బంది, స్థానిక నివాసితులు, ఇతర జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.ద

## ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా అన్ని శాఖలను సమన్వయ పరచుకుంటూ

**బందోబస్త్ డ్యూటీ నిర్వర్తించాలని పోలీసు కమిషనర్ పలు అదేశాలు జారీ చేశారు**



( నేటి శుభోదయ జూన్ : 05 జగన్ ) విశాఖ నగరంలో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా నగర పోలీసు కమీషనర్ డా.శంఖబ్రత బాగ్చి, ఐ.పి.ఎస్., అన్ని శాఖల అధికారులతో కలిసి బ్రీఫింగ్ ఇవ్వడం జరిగింది. నగర పోలీస్ అధికారులు డి.సి.పి-1, డి.సి.పి-2, డి.సి.పి క్రైమ్స్, నగర ట్రాఫిక్ అధికారులు, ఏ.డి.సి.పి లు, ఏ.సి.పి లు, సంబంధిత సీఐ లు పాల్గొన్న ఈ సమావేశం నందు ముఖ్యమంత్రి పర్యటనలో ఎటువంటి అవరోధాలు లేకుండా అన్ని శాఖలను సమన్వయపరచుకుంటూ బందోబస్త్ డ్యూటీ నిర్వర్తించాలని పోలీసు కమిషనర్ పలు అదేశాలు జారీ చేశారు. ఈ సమావేశం నందు ముఖ్యంగా పోలీసు బందొబస్తూ పై, భద్రత పై, ముఖ్యమంత్రి , గవర్నర్ , మంత్రులు మరియు ప్రముఖులు పర్యటించు ప్రాంతాలలో బందోబస్తు నిర్వహించు సిబ్బందికి త్రాగునీరు , మజ్జిగ, భోజనం సమయానికి అందేలాగా చూడాలని ఆదేశించాడు. ఎండ తీవ్రత ఎక్కువ ఉన్నందున సిబ్బందికి వడదెబ్బ తగలకుండా ఓ ఆర్ స్ , మజ్జిగ, అంబులెన్సలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ప్రతి శుక్రవారం నో వెహికల్ డే సందర్భంగా ముఖ్యమంత్రి వారి పర్యటన ఏ యూ హెలిపాడ్ నుండి నోవాటెల్ నకు సైకిల్ మీద పర్యటన ఉంది కావున ఆ యొక్క ఏర్పాట్లను స్వయంగా పోలీసు కమీషనర్ డా.శంఖబ్రత బాగ్చి, ఐ.పి.ఎస్., మరియు డి.సి.పి -1( ఎల్ అండ్ ఓ ) ఏ యూ హెలిపాడ్ నుండి నోవాటెల్ నకు సైకిల్ పై పర్యటించి భద్రత చర్యలు పర్యవేక్షించడమైంది.

# భయాన్ని గెలవండి... జీవితాన్ని గెలవండి!

నేటి శుభోదయ :పరిచయం అక్కర్లేని ఒక అదృశ్య శత్రువు, మనలోనే ఉంటూ మనల్ని శాసించే ఒక నిరంకుశ పాలకుడు ఎవరాయన ఇంకెవరు, భయం! మనిషి జీవితంలో భయం అనేది ఒక నిత్యసహచరుడు. పుట్టుక నుండి మరణం వరకూ, ప్రతి మలుపులో, ప్రతి కీలక నిర్ణయంలో, ప్రతి కొత్త అడుగులో భయం మనల్ని నీడలా వెంటాడుతూనే ఉంటుంది. పరీక్షల్లో తప్పిపోతానేమో అన్న స్టూడెంట్ టెన్షన్, ఉద్యోగం ఊడుతుందేమో అన్న కార్పొరేట్ ఉద్యోగి ఆందోళన, ప్రేమ దూరం అవుతుందేమో అన్న ప్రేమికుడి వేదన, మరణం ముంచుకొస్తుందేమో అన్న వృద్ధుడి భీతి.ఇవన్నీ మానవ మనసును నిరంతరం వేధించే మిలియన్ డాలర్ల ప్రశ్నలు. కానీ బిజీ లైఫ్ నుండి ఒక్కసారి కాస్త బ్రేక్ తీసుకుని, ఆగి ఆలోచిద్దాం ఈ భయం నిజంగా అనివార్యమా లేక ఇది కేవలం మన అజ్ఞానానికి, అవగాహన లేమికి ఒక నిదర్శనమా ఇంటర్నేషనల్ సైకాలజీ పత్రికలు మొదలుకుని మన ఆధ్యాత్మిక గ్రంథాల వరకు ఈ భయం వెనుక ఉన్న అసలు సీక్రెట్‌ను ఎలా విశ్లేషించాయో ఇప్పుడు చూద్దాం.మనోవిజ్ఞాన శాస్త్రవేత్తలు సైంటిఫిక్‌గా తేల్చి చెప్పిన సత్యం ఏమిటంటే భయం అనేది మెదడులోని అమిగ్డాలా అనే భాగం నుండి పుట్టే ఒక రసాయనిక ప్రతిచర్య ఇది మన పూర్వీకులు, అంటే ఆదిమానవులు, అడవిలో క్రూర మృగాల నుండి తమను తాము రక్షించుకోవడానికి ప్రకృతి సిద్ధంగా అభివృద్ధి చేసుకున్న ఒక జీవనావసర సాధనం కానీ, నేటి ఆధునిక కాంక్రీట్ జంగిల్ లైఫ్‌లో ఆ అడవి మృగాలు లేవు. అయినప్పటికీ మన మెదడు మాత్రం ప్రతి చిన్న సమస్యనూ ఒక మృగంగానే పరిగణిస్తూ, లోపల అనవసరమైన భయాన్ని పుట్టిస్తూనే ఉంటుంది. కాలం మారింది, కాలంతో పాటు మన జీవన పరిస్థితులూ మారాయి, కానీ ప్రమాదాల పట్ల మన పాతకాలపు ప్రతిస్పందన మాత్రం అస్సలు మారలేదు ఇదే నేటి ఆధునిక మానసిక క్షోభకు, ఒత్తిడికి ప్రధాన మూల కారణం.నిజానికి భయానికి రెండు భిన్నమైన ముఖాలు ఉంటాయి.మొదటిది వాస్తవమైన భయం అంటే, మన కళ్ల ముందు నిజంగా ఉన్న ప్రమాదం నుండి పుట్టే భయం. ఉదాహరణకు రోడ్డుపై వేగంగా దూసుకొచ్చే వాహనాన్ని చూసి పక్కకు తప్పుకోవడం. ఇది మనల్ని కాపాడుతుంది, అప్రమత్తం చేస్తుంది. కాబట్టి ఇది మనకు ఎంతో ఆవశ్యకమైనది.రెండవది కల్పిత భయం అంటే, ఇంకా జరగనిదాన్ని గురించి, అసలు భవిష్యత్తులో జరుగుతుందో లేదో కూడా తెలియనిదాన్ని గురించి మనం సొంతంగా మనసులో ల్యాబొరేటరీ పెట్టి తయారుచేసుకున్న భయం. విచారకరమైన విషయం ఏంటంటే, మన జీవితాల్లోని 90 శాతం భయాలు ఈ రెండవ కేటగిరీకి చెందినవే! రాబోయే భవిష్యత్తు గురించిన లేనిపోని భయం, గడచిపోయిన గతం గురించిన పశ్చాత్తాపం, ఇతరులు నా గురించి ఏమనుకుంటారో' అన్న సామాజిక ఆందోళన ఇవన్నీ మనమే మన చేతులతో మన మనసులో నిర్మించుకున్న అదృశ్య జైళ్ళు.ఒక చిన్న నిప్పు ముక్క పొరపాటున చేతికి తగిలినప్పుడు మనం వెంటనే చేయి వెనక్కి తీసుకుంటాం. ఇది సహజమైన జైవిక ప్రతిచర్య ఇది శారీరకంగా చాలా సరైనదే. కానీ సమస్య ఎక్కడ వస్తుందంటే, భయం మనల్ని మానసికంగా కూడా అలాగే చేయిస్తుంది. జీవితంలో అద్భుతమైన కొత్త అవకాశాలు వచ్చినప్పుడు, సరికొత్త ప్రేమ చిగురించినప్పుడు, సరికొత్త స్వప్నాలు మనసులో మొలకెత్తినప్పుడు భయం అనే బ్రేక్ మనల్ని వెనక్కి లాగుతుంది. అక్కడ పరిస్థితి నిజంగా ప్రమాదకరం కాకపోయినా, మన అభద్రతాభావమే మనల్ని ఒక పంజరంలో బందీలుగా మారుస్తుంది.భయం అనేది ఒక మానసిక కారాగారం, దానికి తాళం మన చేతిలోనే ఉంటుంది కానీ మనం దాన్ని తెరవడానికి భయపడతాం.సమాజంలో ఎంతమంది ప్రతిభావంతులైన యువతీయువకులు కేవలం విఫలమవుతానేమో అన్న ఫోబియాతో తమ అద్భుతమైన కలల్ని మధ్యలోనే సమాధి చేసేశారు ఎంతమంది ప్రేమికులు రిజెక్ట్ అవుతానేమో అన్న భయంతో మనసులోని మాటను పెదవుల దాకా కూడా తీసుకురాలేకపోయారు ఎంతమంది అసాధారణ కళాకారులు సమాజం నవ్వుతుందేమో, పరిహసిస్తుందేమో అని తమ అపురూపమైన కళను గుండెల్లోనే దాచేసుకున్నారు ఎంతమంది మహిళలు సమాజం ఏమనుకుంటుందో అన్న భయంతో తమ కనీస హక్కులను సైతం కోల్పోయి మౌనంగా బ్రతుకుతున్నారు ఆలోచించండి, భయం అనేది కేవలం ఒక వ్యక్తిగత నష్టం మాత్రమే కాదు. ఒక సమాజం మొత్తాన్ని ఎదగనివ్వకుండా తొక్కిపెట్టే ఒక అదృశ్య విష బీజం!ప్రపంచ ప్రఖ్యాత దార్శనికుడు జిద్దు కృష్ణమూర్తి ఒకచోట అద్భుతమైన మాట చెప్పారు.భయాన్ని నువ్వు ఎప్పుడైతే పూర్తిగా అర్థం చేసుకుంటావో, ఆ మరుక్షణమే అది మాయమవుతుంది. ఇది నూటికి నూరు పాళ్ళు నిజం.

ఉదాహరణకు, గాఢాంధకారంలో ఒక నిరాకార నీడను చూసి మనం దయ్యం అనుకుని వణికిపోతాం. కానీ, ఒక చిన్న కొవ్వొత్తి వెలిగించి స్పష్టంగా చూస్తే అది అక్కడ పడి ఉన్న ఒక ముసలి కుర్చీ లేదా బట్టల స్టాండ్ మాత్రమే అని తెలుసుకుంటాం. ఇక్కడ భయం అనేది అజ్ఞానపు చీకటిలో మాత్రమే పెరిగే ఒక పిచ్చి మొక్క. అవగాహన అనే వెలుతురు రేఖ ప్రసరించిన మరుక్షణం, ఆ మొక్క వేళ్ళ వద్దే మాడిపోతుంది.ఇంతకీ అవగాహన అంటే ఏమిటి అవగాహన అంటే మరేదో కాదు నిన్ను నువ్వు లోతుగా తెలుసుకోవడం. నీలోని భయం అసలు ఎక్కడ నుండి పుడుతోంది, దాని వెనుక గతంలో జరిగిన ఏ చేదు అనుభవం దాగి ఉంది, ఏ బలహీనమైన నమ్మకం దాన్ని రోజూ పోషిస్తోందో నిశితంగా గమనించడం. ఉదాహరణకు, ఒక వ్యక్తికి సబ్‌కాన్షియస్ మైండ్‌లో నేను సక్సెస్‌కు అర్హుడిని కాను అనే అంతర్లీన నమ్మకం ఉంటే, అతను చేసే ప్రతి కొత్త ప్రయత్నంలోనూ తీవ్రమైన భయం అతన్ని వెంటాడుతుంది. ఆ తప్పుడు నమ్మకాన్ని గుర్తించి, క్వశ్చన్ చేసి, మైండ్ నుండి డిలీట్ చేయగలిగినప్పుడే భయం యొక్క వేళ్ళు శాశ్వతంగా తెగిపోతాయి. భయం నుండి పారిపోవడం ఎప్పటికీ పరిష్కారం కాదు భయాన్ని కళ్ళు తెరుచుకుని ధైర్యంగా చూడడమే ఏకైక పరిష్కారం. అప్పుడది కర్పూరంలా కరిగిపోతుంది.భయం లేకుండా జీవించడం అంటే బాధ్యతారాహిత్యంగా, అజాగ్రత్తగా జీవించడం అని అస్సలు కాదు. అది అసలైన నిర్భయత్వం! ధైర్యమంటే భయం లేకపోవడం కాదు, భయం మనల్ని కాళ్ళకు బంధాలు వేస్తున్నా, గుండె నిబ్బరంతో ముందుకు నడవడం. నిజమైన ధైర్యం అనేది ఎప్పుడూ భయంపైనే నిర్మించబడుతుంది. మహాభారతంలో అర్జునుడికి కురుక్షేత్ర రణరంగంలో భయం, విషాదం కలిగాయి. కానీ శ్రీకృష్ణుడు పరమ జ్ఞానంతో ఆ భయాన్ని ఒక గొప్ప అవగాహనగా మార్చాడు. అందుకే భగవద్గీత అనేది కేవలం ఒక ఆయుధగ్రంథం కాదు అది మనిషి అంతరంగాన్ని మేల్కొలిపే ఒక గొప్ప అవగాహనా గ్రంథం నిజమైన స్వేచ్ఛ అంటే బాహ్య పరిస్థితులు అన్నీ మనకు అనుకూలంగా ఉన్నప్పుడు మాత్రమే ఏసీ రూమ్‌లో కూర్చుని సంతోషంగా ఉండటం కాదు. బాహ్య పరిస్థితులు ఎంత ఎదురుతిరిగినా, లైఫ్ ఎలాంటి కుదుపులకు లోనైనా, లోపల మనసును స్థిరంగా ఉంచుకోవడం. అలలు లేని చలించని సముద్రం ప్రశాంతంగా ఉండొచ్చు, కానీ అది నిజమైన సముద్ర లక్షణం కాదు ఉపరితలంపై ఎన్ని భీకర తుఫానులు వచ్చినా, తన అనంతమైన లోతుల్లో మాత్రం ఎల్లప్పుడూ పరమ శాంతిగా ఉండేదే అసలైన సముద్రం. మన జీవితం కూడా అంతే! ఆ అంతర్గత లోతులే అవగాహన... ఆ అచంచలమైన శాంతే నిర్భయత్వం!మీ దైనందిన జీవితంలో భయాన్ని జయించడానికి ఇక్కడ కొన్ని ప్రాయోగిక మార్గాలు ఉన్నాయి.మన దైనందిన జీవితంలో భయాన్ని జయించడానికి నాలుగు ముఖ్యమైన సూత్రాలను పాటించాలి. మొదటగా, మనలో భయం ఉందని ఎలాంటి అహంకారం (ఈగో) లేకుండా నిజాయితీగా గుర్తించి, ఆ భయానికి ఒక పేరు పెట్టాలి, అలా చేసినప్పుడే అది సగం బలాన్ని కోల్పోతుంది. రెండవది, ఆ భయం నిజంగానే సంభవిస్తుందా లేదా అని లాజికల్‌గా ప్రశ్నించడం ద్వారా దాన్ని మేఘంలా కరిగించవచ్చు. మూడవది, భయపడి వెనకడుగు వేయకుండా, ఆ భయంతో పాటే ధైర్యంగా ఎదురు నడవడం అలవాటు చేసుకోవాలి, మొదటి అడుగే భయాన్ని యాభై శాతం తగ్గిస్తుంది. చివరగా, గతం గురించిన పశ్చాత్తాపం, భవిష్యత్తు గురించిన ఆందోళనలను పక్కన పెట్టి, మైండ్‌ఫుల్‌నెస్ మరియు ధ్యానం వంటి సాధనాలతో కేవలం వర్తమానంలో (ఈ క్షణంలో) జీవించడం నేర్చుకోవాలి. ఈ నాలుగు సూత్రాలు భయాన్ని అధిగమించడానికి అద్భుతంగా తోడ్పడతాయి.

భయం లేని నిర్భయ జీవనం సాధ్యమేనా అంటే బిగ్ ఎస్, ఖచ్చితంగా సాధ్యమే! కానీ అది ఒక్కరోజులో ఓవర్‌నైట్ వచ్చే మ్యాజిక్ కాదు. అది ఒక నిరంతర ప్రక్రియ ప్రతి రోజూ కొంచెం కొంచెం తనను తాను అర్థం చేసుకోవడం, తన భయాల మూలాలను తవ్వి చూడడం, పాత నమ్మకాలను ప్రశ్నించడం ఇవే అవగాహనకు రాజమార్గాలు.మన తెలుగు సంస్కృతిలో అభయం అనే పదానికి ఎంతో పవిత్రమైన విశిష్టత ఉంది. దేవతా మూర్తులు అభయ ముద్ర ఇవ్వడం అంటే భయపడకు, నేను నీతో ఉన్నాను అని భరోసా ఇవ్వడం. ఆ అభయం ఎవరైనా బయట నుండి తాత్కాలికంగా ఇవ్వవచ్చు. కానీ నీ జీవితాన్ని మార్చే నిజమైన శాశ్వత అభయం నీలోనే పుట్టాలి. నీలో పెరిగే అవగాహన మాత్రమే నీకు ఆ అభయముద్రను ప్రసాదిస్తుంది.జీవితమనే ఈ లాంగ్ జర్నీలో భయం అనేది ఒక వర్షంలా అప్పుడప్పుడు వస్తూ పోతూ ఉంటుంది.

అంతమాత్రాన ప్రయాణం ఆపేస్తామా? లేదు! అవగాహన అనే ఒక స్ట్రాంగ్ గొడుగు మన చేతిలో ఉంటే వర్షంలో తడవకుండా ఎంతటి సుదూర తీరాలకైనా ధైర్యంగా ముందుకు సాగగలం. ఆ గొడుగును మనసులో తయారు చేసుకోవడమే మానవ జీవితపు అసలు సిసలైన టాస్క్. ఈ అద్భుతమైన పనిలో ఆలస్యానికి అస్సలు తావులేదు.ఇంకెందుకు ఆలస్యం, ఈ క్షణం నుంచే ఆ నిర్భయ ప్రయాణాన్ని మొదలుపెట్టేయండి! డా .సూర్యదేవర రామకృష్ణ ,9490754169

## నేడు యాడికిలో పర్యావరణ అవగాహన సదస్సు

**మనం మొక్కను పెంచితే అదే మొక్క మన ప్రాణాన్ని కాపాడుతుంది.**








యాడికి జూన్ 04 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అనంతపురం జిల్లా యాడికి గ్రామంలో ఎన్విరాన్మెంట్ ఎన్జీవో సంస్థల ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రేపటి తరం మనుగడకు పచ్చని పర్యావరణం ఎంత అవసరమో, ఆపదలో ఉన్న తోటి ప్రాణాన్ని కాపాడటానికి రక్తదానం అంతే ముఖ్యం అనే సందేశంతో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తాసిల్దార్ ప్రతాపరెడ్డి ఎంపీడీవో వీరరాజు సిఐ శ్రీనివాసులు పాల్గొనడం జరుగుతుంది. యాడికిలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి గుడి ఎదురుగా నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో భాగంగా భారీ ఉచిత రక్తదాన శిబిరంతో పాటు పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సును కూడా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం యొక్క ప్రత్యేకత ఏమిటంటే, రక్తాన్ని దానం చేసి ప్రాణదాతలుగా నిలిచిన ప్రతి రక్తదాతకు, పర్యావరణాన్ని కాపాడేందుకు గుర్తుగా ఉచితంగా ఒక మొక్కను అందజేయనున్నారు. రక్తదానంతో ప్రాణదాతలుగా మారి, మొక్కను నాటి పర్యావరణ రక్షకులుగా నిలవాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. ఈ స్వచ్ఛంద సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, యాడికి గ్రామ ప్రజలు, యువతీ యువకులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ మహాయజ్ఞంలో భాగస్వాములు కావాలని ఎన్జీవో ప్రతినిధులు కోరుతున్నారు. రేపు ఉదయం 9:00 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొని, మన ఊరి బాగు కోసం మరియు పచ్చదనం పెంపొందించడం కోసం తోడ్పడాలని ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బండారు బాలకృష్ణ, శావల శారద, ఆలూరు చంద్రశేఖర్ రెడ్డి, బండారు ధనుంజయ, కాయపాటి నరేష్ తదితరులు పాల్గొనడం జరిగింది...


## స్థానిక ఎన్నికల సమరానికి సై అంటున్న జనసైనికులు

**గ్రామస్థాయిలో పార్టీ బలోపేతమే లక్ష్యం: జనసేన**



గూడెం కొత్త వీధి,నేటి శుభోదయ,జూన్ 4: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా జనసేన పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేయాలని పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. రాష్ట్ర జానపద కళలు సృజనాత్మక అకాడమీ చైర్మన్, పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ వంపూరు గంగులయ్య ఆదేశాల మేరకు మండల కేంద్రంలో నిర్వహించిన జనసేన ముఖ్య నాయకుల సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. మండల అధ్యక్షుడు కొయ్యం బాలరాజు, అరకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు గొర్లె వీరవెంకట్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పార్టీ బలోపేతం, గ్రామ స్థాయి కార్యాచరణ, ప్రజా సమస్యల పరిష్కారం, ఎన్నికల సన్నద్ధత తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్థానిక ఎన్నికలు ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబమని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధి, పారదర్శక పరిపాలన, ప్రజా సంక్షేమం, సమస్యల పరిష్కారంలో జనసేన పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తుందని తెలిపారు. ప్రతి జనసైనికుడు ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.గిరిజన ప్రాంతాల్లో తాగునీరు, రహదారులు, విద్య, వైద్య రంగాల్లో ఉన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజా సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని నాయకులు పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలు, ప్రజా సేవా దృక్పథాన్ని ఆదర్శంగా తీసుకుని పార్టీని గ్రామ స్థాయిలో మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.రానున్న స్థానిక ఎన్నికల్లో జీకే వీధి మండలంలో జనసేన పార్టీ సత్తా చాటేలా ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది.ఈ కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ చైర్మన్ వాసుపరి ప్రసాద్, పొత్తూరు విష్ణుమూర్తి, విరోజీ త్రిమూర్తులు, గడుతూరి పరమేష్, కొయ్యం ఇమ్మానుయేల్ సిద్దు, నాడేలా సత్యారావు, ఉల్లం ఈశ్వర్, వనపల ఈశ్వర్,మూర్తి, గబులంగి గణేష్,వంశీ, పాంగి శ్రీను, సాగిన బ్రహ్మాజీ పడాల్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజలకు ఇచ్చిన మాట మరిచిన ప్రభుత్వం



పులిచెర్ల, జూన్ 4,(నేటి శుభోదయ) : ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు పెద్దిరెడ్డి విమర్శించారు. చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం కల్లూరులో గురువారం నిర్వహించిన "వెన్నుపోటుకు రెండేళ్లు" నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.ఎంపీపీ సురేంద్రనాథ్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నాదముని రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా నిరసనకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటి అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని నాయకులు ఆరోపించారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల విషయంలో ప్రజలు నిరాశ చెందుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ నాగరాజు ప్రసాద్, చంద్రశేఖర్ రెడ్డి ముర్వత్ బాషా, ఆనందా, హేమసుందర్ రెడ్డి,నిరంజన్, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా తమ నిరసనను వ్యక్తం చేశారు.

## సేవలపై వేగం పెంచాలి




పులిచెర్ల, జూన్ 4,(నేటి శుభోదయ) :చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం, కల్లూరు, దేవళంపేట, కమ్మపల్లె స్వర్ణ గ్రామ పంచాయతీ కార్యాలయాలను చిత్తూరు డివిజన్ అభివృద్ధి అధికారి రవికుమార్ గురువారం తనిఖీ చేశారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు సకాలంలో అందేలా చూడాలని, వాట్సాప్ మిత్ర, వాట్సాప్ గవర్నెన్స్ వంటి సేవలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని సిబ్బందికి సూచించారు. చిన్నపిల్లల ఆధార్ నమోదు, తల్లికి వందనం డిజిటల్ చెల్లింపుల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యాలయాల శుభ్రత, రికార్డుల నిర్వహణపై కూడా ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవోలు హరికుమార్, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జన విశ్వాస్'తో సురక్షిత ప్రయాణాలకు పోలీసుల భరోసా



పులిచెర్ల, జూన్ 4,(నేటి శుభోదయ) : ప్రజల భద్రత, మహిళల రక్షణకు ప్రాధాన్యత ఇస్తూ జిల్లా పోలీసు శాఖ చేపట్టిన "జన విశ్వాస్--సురక్షిత త్రిచక్ర వాహన ప్రయాణాలు" కార్యక్రమంలో భాగంగా కల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆటోరిక్షాలకు ప్రత్యేక క్యూఆర్ కోడ్, యూనిక్ పోలీస్ ఐడెంటిఫికేషన్ నంబర్ కలిగిన స్టిక్కర్లను గురువారం అతికించారు.జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీఐ జయరామయ్య, ఎస్ఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే వాహనం, డ్రైవర్, యజమాని వివరాలు వెంటనే అందుబాటులోకి వచ్చేలా వ్యవస్థ రూపొందించినట్లు తెలిపారు. ఈ చర్యతో ప్రయాణికుల భద్రత మెరుగుపడటంతో పాటు నేరాల నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణలో మరింత సమర్థత సాధ్యమవుతుందని సీఐ జయరామయ్య పేర్కొన్నారు.

## నేడు శ్రీ పెద్దగుండాలమ్మ ఆలయంలో ప్రత్యేక అభిషేకం



పులిచెర్ల, జూన్ 4,(నేటి శుభోదయ) :చిత్తూరు జిల్లా, పులిచెర్ల మండలం కొత్తపేట - భీమవరం రహదారి లో వెలసిన శ్రీ పెద్దగుండాలమ్మ ఆలయంలో శుక్రవారం సాయంత్రం 6 గంటలకు అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, అలంకరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి దర్శనం చేసుకుని ఆశీస్సులు పొందాలని కోరారు. అనంతరం అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

## డాక్టర్ మల్లాది ప్రసాదరావుకు "ఉత్తమ సేవ పురస్కారం"



రెడ్డిగూడెం,, జులై 04:తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాలలో స్వచ్ఛందంగా సేవలందిస్తున్న సామాజిక సేవకులకు "ఉత్తమ సేవ పురస్కార్" అవార్డులను ఘనంగా ప్రదానం చేశారు.హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు చిన్న యేసు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మేడిది సుబ్బయ్య ట్రస్ట్ చైర్మన్ మేడిది వెంకటేశ్వరరావు, హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ జాతీయ మహిళా అధ్యక్షురాలు రుక్మిణి, సంస్థ వ్యవస్థాపకులు బొడ్డపాటి దాసు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం గ్రామానికి చెందిన మదర్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు డాక్టర్ మల్లాది ప్రసాదరావు సమాజ సేవ, పేద ప్రజల సంక్షేమం, విద్య, ఆరోగ్య రంగాల్లో అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తించి "ఉత్తమ సేవ పురస్కారం"తో సత్కరించారు.అవార్డు అందుకున్న డాక్టర్ మల్లాది ప్రసాదరావు మాట్లాడుతూ, ఈ గుర్తింపు తనపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో కూడా సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తానని తెలిపారు.ఈ సందర్భంగా మదర్ సర్వీస్ సొసైటీ సభ్యులు, గ్రామ పెద్దలు, శ్రేయోభిలాషులు డాక్టర్ మల్లాది ప్రసాదరావును అభినందించి, మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు.

## 'కూటమి ప్రభుత్వంలో విద్యకు పెద్దపీట..

**అద్భుతమైన ఫలితాలు..'**

**– 'బడి పిలుస్తోంది' కార్యక్రమంలో రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ..**



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ సీతానగరం మండలం మునికూడలి గ్రామంలో పర్యటనలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన 'బడి పిలుస్తోంది' కార్యక్రమంలో పాల్గొన్నారు. మండల విద్యాధికారి, స్థానిక ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల సమక్షంలో ఒకటో తరగతిలో నలుగురు విద్యార్థులను ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పాఠశాలలో చేర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలరామకృష్ణ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ల నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. విద్యా విధానంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు 5 సంవత్సరాలు నిండగానే గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి, వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని పిలుపునిచ్చారు. నేడు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోకుండా ప్రతిభ కనబరుస్తున్నారని ఎమ్మెల్యే బలరామకృష్ణ కొనియాడారు. ఈ కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం, బీజేపీ పార్టీల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, పాఠశాల సిబ్బంది మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## శ్రీ కనక దుర్గమ్మ వారిని దర్శించుకున్న జాతీయ ఎస్టీ కమిషన్ చైర్మన్ అంతర్ సింగ్ ఆర్య



విజయవాడ, జూన్ 4 (నేటి శుభోదయ):- జాతీయ ఎస్టీ కమిషన్ చైర్మన్ అంతర్ సింగ్ ఆర్య ఇంద్రకీలాద్రికి చేరుకున్న సందర్భంగా, ఆలయ ఈవో వి.కె. శీనానాయక్ దగ్గరుండి అధికారిక ప్రోటోకాల్ ప్రకారం ఘన స్వాగతం పలికారు. ప్రోటోకాల్ నిబంధనలకు అనుగుణంగా ఈవో ప్రత్యేక దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. అంతర్ సింగ్ శ్రీ కనక దుర్గమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వాద మండపంలో చైర్మన్‌కు వేదాశీర్వచనం అందజేశారు. ఆలయ ఈవో వి.కె. శీనానాయక్, చైర్మన్‌కు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలు, అమ్మవారి చిత్రపటాన్ని అందించి ఆలయ మర్యాదలతో సత్కరించారు.

## ఇంద్రకీలాద్రిపై ఘనంగా సంకటహర చతుర్థి



విజయవాడ, జూన్ 4 (నేటి శుభోదయ):- ఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీ కనక దుర్గమ్మ వారి ఆలయంలో గురువారం సంకటహర చతుర్థిని పురస్కరించుకుని పాత యాగశాల వద్ద ఆలయ అర్చక కార్తీక్, ఇతర అర్చక బృందం, వైదిక కమిటీ పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు చేసారు. ప్రతి తెలుగు మాసంలో వచ్చే సంకటహర చతుర్థి రోజున శ్రీ గణేష్ మహారాజ్ కి గణపతి హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, గణపతి హోమం అత్యంత వైభవంగా నిర్వహించారు. పూజా సామాగ్రితో ఆరాధనలు చేసి, స్వామివారికి ఇష్టమైన నైవేద్యాలను సమర్పించారు. దేవస్థానం వైదిక కమిటీ సభ్యులు ఈ పూజా కార్యక్రమాలను ఆగమ శాస్త్రాలకు అనుగుణంగా నిర్వహించారు. శ్రీ వినాయక స్వామికి విశేష పూజలు చేసి, భక్తులకు అనుగ్రహాశీస్సులు అందించారు. సంకటహర చతుర్థిని పురస్కరించుకుని భక్తులు లక్ష్మీ గణపతి ఆలయాన్ని సందర్శించి, విఘ్నేశ్వరుడిని దర్శించుకున్నారు.

## విద్యావ్యవస్థను పూర్తిగా ధ్వంసం చేసిన ప్రధాని మోడీ



న్యూఢిల్లీ : ప్రధాని మోడీపై లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ గురువారం తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గత 12 ఏళ్లుగా ప్రధాని మోడీ విద్యా వ్యవస్థను పూర్తిగా ధ్వంసం చేశారని, దీంతో ఒక తరం యువత మొత్తం భారీ స్థాయిలో మూల్యం చెల్లించాల్సి వస్తోందని మండిపడ్డారు. నీట్-యుజి పరీక్షలో అవకతవకలు జరిగినట్లు వార్తలు రావడంతో మధ్యప్రదేశ్ లోని మౌగంజ్ జిల్లాకు చెందిన ఆకాంక్ష చతుర్వేది తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిన సంగతి తెలిసిందే. ఆకాంక్ష డాక్టర్ కావాలని, దేశానికి, సమాజానికి సేవ చేయాలని కలలు కనింది. ఆమె తండ్రి ఒక రైతు, తన కుమార్తె కలను నెరవేర్చేందుకు ఆయన తన కిసాన్ క్రెడిట్ కార్డ్ పై మూడు లక్షల రూపాయల రుణం తీసుకున్నారు. తన కుమార్తె కోచింగ్ క్లాసులకు వెళ్లేందుకు వీలుగా ఆయన స్వయంగా నాగ్ పూర్ లో వంటవాడిగా కూడా పనిచేశారు. అని రాహుల్ గాంధీ ఎక్స్ లో పేర్కొన్నారు. ఒక తండ్రి తన కుమార్తె కోసం చేయగలిగినదంతా చేశారు. కానీ నీట్ పేపర్ లీక్ కావడంతో పరీక్ష రద్దయింది. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన ఆకాంక్ష వారిని శాశ్వతంగా విడిచి వెళ్లిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె మరణం ఆత్మహత్య కాదు -- అది ప్రధాని మోడీ హయాంలో కొనసాగుతున్న అవినీతి, విచ్ఛిన్నమైన వ్యవస్థకి చెందిన విషాదకరమైన పర్యవసానం అని రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. మరి ధర్మేంద్ర ప్రధాన్ సంగతేంటి? ఆయన ఇప్పటికీ విద్యాశాఖ మంత్రిగా కొనసాగుతున్నారు. అవే పాత కమిటీలు. అవే పాత బదిలీలు. అవే పాత విచారణలు. సంస్కరణ లేదు, న్యాయం లేదు," అని విమర్శించారు. ప్రధాని మోడీ అధికారంలో శాశ్వతంగా ఉండిపోరు. పదవి వస్తుంది.. పోతుంది. కానీ గత 12 ఏళ్లుగా మీరు విద్యా వ్యవస్థను పూర్తిగా ధ్వంసం చేయడంతో.. ఇప్పుడు యువతలోని ఒక తరం మొత్తం మూల్యం చెల్లించుకుంటోంది," అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్ టి ఎ) మే 3న నిర్వహించిన నీట్ యుజి పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ కావడంతో పరీక్షను రద్దు చేసింది. ప్రస్తుతం దీనిపై సిబిఐ దర్యాప్తు చేపడుతోంది. నీట్ యుజి పరీక్షను జూన్ 21న తిరిగి నిర్వహించనున్నట్లు ఎన్ టి ఎ ప్రకటించింది.

# సూపర్ ఎల్-నినోకు సిద్ధం కండి

### సెప్టెంబరులోగా ఏర్పడే ఛాన్స్ 80 శాతం!
### ప్రపంచ వ్యాప్తంగా కరవు కాటకాలు
### పెచ్చరిల్లనున్న వడగాడ్పులు, వరదలు
### భానుడి భగభగలు మరింత తీవ్రం
### ఉత్తర, మధ్య భారతంలో కరవు
### దక్షిణాది రాష్ట్రాలకు వరద ముప్పు
### హెచ్చరిస్తున్న ప్రపంచ వాతావరణ సంస్థ



ఇక అనుమానాలు అక్కరలేదు. ఈ ఏడాది ప్రపంచదేశాలకు మాత్రమే కాదు.. భారతదేశానికీ గడ్డుకాలమే. చుట్టపుచూపుగా కరవు కాటకాలను పరిచయం చేసి వెళ్లిపోయే ఎల్--నినో ఈ సారి తన విశ్వరూపాన్ని చూపనుంది. ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా ప్రకృతి వైపరీత్యాలు పెచ్చరిల్లుతాయని, సూర్యుడి ప్రతాపం కూడా ఎక్కువ కానుందని తాజాగా ప్రపంచ వాతావరణ సంస్థ సైతం హెచ్చరించింది. ఎక్కడో దక్షిణ అమెరికా ఖండంలోని పసఫిక్ మహా సముద్రం ఉపరితల ఉష్ణోగ్రతలు కొన్ని డిగ్రీలు పెరిగితే వచ్చే వాతావరణ మార్పులను ఎల్--నినో అని, చల్లబడితే లా--నినా అంటారని మనకు తెలుసు. భారత్ లాంటి దేశాల్లో లా--నినా అధిక వృష్టికి కారణమవుతూంటుంది. ఈ రెండూ సాధారణంగా 3 నుంచి ఏడేళ్లకు ఒకసారి వచ్చి పోతూంటాయి. అయితే గత రెండు దశాబ్దాలుగా ఈ పరిస్థితిలో తేడా స్పష్టంగా కనిపిస్తోంది. తరచూ రావడం ఒక సమస్య అయితే... ఒక్కోసారి ఒక్కోలా ప్రభావం చూపడం రెండో సమస్య. భూతాపోన్నతి (గ్లోబల్ వార్మింగ్) కారణంగా ఈ రెండు వాతావరణ అంశాల తీవ్రత పెరిగిపోయింది. వర్షపాతంలో విపరీతమైన తేడాలు నమోదవడాన్ని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఎల్--నినో ఏర్పడినప్పుడు కొన్ని ప్రాంతాల్లో కరవు కాటకాలు.. కొన్ని చోట్ల వరదలు ముంచెత్తుతున్నాయి. లా--నినా సందర్భంలోనూ అధిక వర్షపాతాల స్థానంలో నగరాలను ముంచెత్తే క్లౌడ్‌బరస్ట్‌లు తరచూ నమోదు అవుతూండటం గమనార్హం. ఈ నేపథ్యంలోనే ఈ ఏడాది సూపర్ ఎల్--నినో ఏర్పడుతుందన్న ప్రపంచ వాతావరణ సంస్థ అంచనాలు ఆందోళన కలిగిస్తున్నాయి.

#### సెప్టెంబరు లోగా...


ఈ ఏడాది నైరుతి రుతుపవనాల ప్రభావం సాధారణ స్థాయిలో ఉంటుందని భారత వాతావరణ సంస్థ ఇప్పటికే తెలిపిన విషయాన్ని ఒక్కసారి ఇక్కడ ప్రస్తావించాలి. ఎందుకంటే ఈ అంచనాల్లో సూపర్ ఎల్--నినో ప్రస్తావన లేదు. జూన్ నెలలో ప్రపంచ వాతావరణ సంస్థ వెలువరించిన అంచనాల ప్రకారం ఈ ఏడాది సెప్టెంబరు నుంచి నవంబరు వరకూ సూపర్ ఎల్--నినో పరిస్థితులు ఏర్పడేందుకు 80 -- 90% అవకాశం ఉంది. ఇప్పటికే అగ్ని గుండాన్ని తలపిస్తున్న వాతావరణానికి ఈ సూపర్ ఎల్--నినో ఆజ్యం పోయనుందని, దీన్ని అత్యవసర వాతావరణ హెచ్చరికగా పరిగణించాలని ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరెస్ స్వయంగా ప్రకటించడం సమస్య తీవ్రతను స్పష్టం చేస్తోంది. రెండేళ్ల క్రితం 2023--24 లోనూ సూపర్ ఎల్--నినో ఏర్పడినా ఆ ఏడాది అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన సంవత్సరాల్లో ఐదవదిగా రికార్డు సృష్టించిన విషయం తెలిసిందే. సెప్టెంబరు -- నవంబరుల మధ్య సూపర్ ఎల్--నినో పరిస్థితులు ఏర్పడితే దాని ప్రభావం తొమ్మిది నుంచి పన్నెండు నెలల వరకూ ఉంటుందని అంచనా. అంటే వచ్చే ఏడాది కూడా మాడు పగిలే ఎండలు, వడగాడ్పులు తప్పవన్నమాట. ఎండలు పెరిగితే దాని ప్రభావం పంట దిగుబడులపై కూడా ఉంటుందన్నది నిర్వివాద అంశం.

#### మనపై ప్రభావం ఇలా...

సూపర్ ఎల్--నినో ప్రభా వం 2026 నైరుతి రుతుపవనాలపై జూలై నెల నుంచి కనిపించడం ప్రారంభమవుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. జూన్ ఒకటవ తేదీన కేరళను తాకిన రుతుపవనాలు ముందుకు కదలడంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. జూలైలో ఉత్తర, మధ్య, పశ్చిమ భారత దేశ ప్రాంతాల్లో వర్షపాతంలో లోటు వచ్చే అవకాశాలు చాలా ఎక్కువ. పంజాబ్, హర్యానా, ఢిల్లీలలో కరవు పరిస్థితులు రావొచ్చు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలో వర్షపాతం తక్కువగా ఉంటుంది. ఆసక్తికరంగా జూలై -- ఆగస్టు నెలల్లో దక్షిణాది రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల్లో విపరీతమైన వర్షాలు కురిసి వరదలు రావచ్చునని అంచనాలు చెబుతున్నాయి. సెప్టెంబరులో ముఖ్యంగా చెన్నై, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు సముద్ర తీర ప్రాంతాల్లో ఈ సమస్య ఎదురు కావచ్చునని నిపుణులు చెబుతున్నారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే సూపర్ ఎల్--నినో ప్రభావం కారణంగా 2026-- 27 రబీ సీజన్ పంటలపై తీవ్రమైన వ్యతిరేక ప్రభావం పడుతుంది.

## కేరళను తాకిన నైరుతి రుతుపవనాలు

### - భారీ వర్ష హెచ్చరిక



తిరువనంతపురం: కేరళంలోకి నైరుతి రుతుపవనాలు గురువారం ప్రవేశించాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. వాస్తవానికి మే 26న కేరళ తీరాన్ని రుతుపవనాలు తాకవచ్చని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తొలుత అంచనా వేసింది. అయితే, ఎల్‌నినో ప్రభావంతో రుతుపవనాల రాక కొంత ఆలస్యమైంది. మరో వారం రోజుల్లో ఏపీ, తెలంగాణ రాష్ట్రాలలో నైరుతి రుతుపవనాలు ప్రవేశించనున్నాయి. అదే విధంగా తమిళనాడులోని పలు జిల్లాల్లో కూడా రానున్న గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఢిల్లీలో కనిష్ట ఉష్ణోగ్రత 29.7 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. దీంతో వర్షం, ఉరుములతో కూడిన తుఫానుకు సంబంధించి వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. కేరళలోని 15జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. తిరువనంతపురం, కొల్లాం, పతనంతిట్ట, అలప్పుజ, కొట్టాయం, ఇడుక్కి, ఎర్నాకులం, త్రిస్సూర్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈ ప్రాంతాల్లో 24 గంటల్లో 115.6 మి.మీ. నుంచి 204.4 మి.మీ. వరకు అతి భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. పాలక్కాడ్, మలప్పురం, కోజికోడ్, వయనాడ్, కన్నూర్, కాసరగోడ్ జిల్లాల్లో ఎల్లో అలర్ట్ అమల్లో ఉంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురవడంతో పాటు గంటకు 40--50 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. జూన్ 7 వరకు కేరళ, మాహే ప్రాంతాల్లో విస్తృతంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దక్షిణ కేరళ తీరానికి సమీపంలోని అరేబియా సముద్రంలో, అలాగే ఉత్తర అండమాన్ సముద్ర ప్రాంతంలో ఏర్పడిన వాతావరణ వ్యవస్థల ప్రభావంతో వర్షాలు మరింత ఉధృతమయ్యే అవకాశముంది. ఇదే సమయంలో కేరళ--కర్ణాటక--లక్షద్వీప్ తీర ప్రాంతాల్లో గంటకు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఆదివారం వరకు చేపల వేటకు వెళ్లవద్దని మత్స్యకారులకు సూచించింది. మెరుపులు, ఉరుములతో కూడిన వర్షాలు ప్రాణనష్టం, విద్యుత్ మరియు కమ్యూనికేషన్ వ్యవస్థలకు నష్టం కలిగించే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

# ఇప్పటికైనా కళ్లు తెరుస్తారా?

అన్నిచోట్లా అడుగడుగునా కనబడే అవినీతి, నిర్లక్ష్యం దేశాన్నేలే ఉన్నతాధికార వ్యవస్థలు కొలువుదీరిన ఢిల్లీలో కూడా నిక్షేపంగా కొనసాగుతున్నాయని మూడురోజుల వ్యవధిలో జరిగిన రెండు విషాద ఘటనలు రుజువు చేశాయి. శనివారం రాత్రి అయిదంతస్తుల భవంతి కూలి పోటీ పరీక్షలకు కోచింగ్ కోసం వచ్చిన అయిదుగురు విద్యార్థులతోపాటు మరో మహిళ మరణించగా, దాదాపు 20 మంది గాయపడ్డారు. ఇది మరువకముందే బుధవారం వేకువజామున దక్షిణ ఢిల్లీలో ఒక హోటల్ మంటల్లో చిక్కుకుని 21 మంది చనిపోయారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందటానికి వచ్చే విదేశీయులు ఈ హోటల్‌లో బస చేస్తారని చెబుతున్నారు. ఈ రెండు ఉదంతాలూ ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ) పనితీరుకు అద్దం పడతాయి. దేశంలో దాదాపు అన్నిచోట్లా నియమోల్లంఘనలు కనబడుతూనే ఉంటాయి. వాటిని పట్టించుకోని అధికార యంత్రాంగాలకూ కొదవ లేదు. కానీ ఢిల్లీలోనూ ఇదే స్థితి! పైగా ఇలాంటి ఉదంతాలు ఆ నగరానికి కొత్తగాదు. 2024లో ఒక చిన్న పిల్లల ఆసుపత్రి మంటల్లో చిక్కుకుని ఏడుగురు నవజాత శిశువులు కన్నుమూశారు. అదే ఏడాది ఒక సెల్లార్‌లో నిర్వహిస్తున్న కోచింగ్ సెంటర్‌లోకి వరద నీరు ప్రవేశించి ముగ్గురు విద్యార్థులు మరణించారు. ఈ మహానగరంలో కాలం చెల్లిన భవంతులు కూలడం, ఏడాదికి ఒకటో రెండో అగ్నిప్రమాదాలు రివాజుగా మారడం... అయినా ఎవరికీ చీమ కుట్టినట్టయినా అనిపించకపోవటం దిగ్భ్రాంతికరం. ఎంసీడీ అధికారులు గుణపాఠం నేర్వకపోవడం సరే... ఢిల్లీ ప్రభుత్వం లేదా కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ నిస్సహాయంగా మిగలటం క్షమార్హం కాదు. ముఖ్యమంత్రి రేఖా శర్మకు ఈ సమస్యలన్నీ తెలియవనుకోలేం. ఆమె మూడు దఫాలు కార్పొరేటర్‌గా పని చేశారు. 2023లో లోక్‌సభలో ఒక ప్రశ్నకు కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ జవాబిస్తూ రాజధాని నగరంలో నియమాలు ఉల్లంఘించిన భవంతులు 55,000 వరకూ ఉన్నాయని తెలియజేసింది. ఆ జాబితాలోని ఎందరిపై చర్య తీసుకున్నారో, ఆ భవంతుల్ని ఏం చేశారో ఎవరికీ తెలియదు. శనివారం ప్రమాదం జరిగిన అయిదంతస్తుల భవనం కూడా నిబంధనలు ఉల్లంఘించి నిర్మించిందే. కేవలం మూడంతస్తులకు అనుమతి ఉంటే, మరో రెండంతస్తులు వేయటమే కాక, తాజాగా మరో అంతస్తు నిర్మాణానికి




పనులు చేయిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అప్పటికే బలహీనమైన పునాదులపై నాసిరకంగా నిర్మించిన ఆ భవంతిపై అదనపు భారం పడటంతో కూలిపోయిందని చెబుతున్నారు. అలాంటి భవంతి నివాసయోగ్యమైనదేనని ఎంసీడీలో ధ్రువీకరించిందెవరో తేలాలి. బంగారు భవిష్యత్తును ఆశించి రకరకాల కోచింగ్‌ల కోసమని యువత వస్తుంది. చవగ్గా లభిస్తుందన్న కారణంతో అనేకులు ఇలాంటి భవంతుల్ని ఆశ్రయిస్తారు. కిక్కిరిసిన జనావాసాలున్నచోట మంచినీరు, డ్రెయినేజి ఏర్పాట్లు, విద్యుత్ సరఫరా ఎంతో కష్టమవుతాయి. అయినా అధికార యంత్రాంగాలు మౌనంగా ఉండిపోతున్నాయి. బుధవారం మంటల్లో చిక్కుకున్న హోటల్‌ల్లో రాకపోకలకు కేవలం ఒకే మార్గం ఉందని చెబుతున్నారు. ఆరు గదులకే అనుమతి ఉన్న హోటల్ ఏకంగా అయిదంతస్తుల్లో ఇరవై గదులు నిర్మించింది. దీనికి అగ్నిమాపక శాఖ ఎన్‌ఓసీ లేదంటున్నారు. మధ్యతరగతికి అందుబాటు ధరల్లో ఇళ్లు లభించే ప్రభుత్వ విధానాలు లేకపోగా, అక్రమ కట్టడాలు, కాలనీలు వెలుస్తాయి. అవి క్రమబద్ధమవుతాయి. అల్పాదాయ వర్గాలు ఏ సదుపాయాలూ లేని అలాంటి నాసిరకం భవంతుల్లో ఉండక తప్పడంలేదు. ఢిల్లీలో ప్రణాళికాబద్ధంగా లేని ప్రాంతం దాదాపు 60 శాతంమేర ఉంటుందని ఒక అంచనా. 2014లో ఒక ప్రత్యేక చట్టం ద్వారా 1,799 కాలనీలను క్రమబద్ధం చేశారు. అటుతర్వాత ఎట్టిపరిస్థితుల్లోనూ అక్రమ కాలనీలను, నిర్మాణాలనూ అనుమతించ బోమన్నారు. కానీ ఈ పుష్కరకాలంలో అలాంటి మరిన్ని వందల కాలనీలు, వాణిజ్య, నివాస భవంతులు ఉనికిలోకొచ్చాయి. ఏటా వర్షాకాలానికి ముందు ఎంసీడీ తనిఖీలు సాగుతుంటాయి. అవన్నీ మొక్కుబడి వ్యవహారాలేనని ఈ ప్రమాదాలు రుజువు చేస్తు న్నాయి. భూకంప జోన్--4లో ఉన్న ఢిల్లీలో ఇకనైనా పాలకులు మేల్కొంటారా? నిర్మాణ రంగ ఇంజినీర్లతో, నిపుణులతో సంప్రదించి తగిన చర్యలు తీసుకుంటారా?

## నేటి నుండి ప్రారంభమైన పాఠశాలలు..
## శుభాకాంక్షలు తెలిపిన సిఎం విజయ్



చెన్నై : 2026-27 విద్యా సంవత్సరానికి గాను రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు గురువారం నుండి ప్రారంభమయ్యాయి. అయితే ఈ విద్యా సంవత్సరం జూన్ 1న ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ, రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తీవ్రమైన ఎండల కారణంగా మూడు రోజుల పాటు ప్రభుత్వం వాయిదా వేసింది. పాఠశాలలు తిరిగి తెరుచుకున్న సందర్భంగా తమిళనాడు ముఖ్యమంత్రి సి. విజయ్ జోసెఫ్ విద్యార్థులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. " కొత్త విద్యా సంవత్సరం కోసం పాఠశాలలకు తిరిగి వస్తున్న విద్యార్థులు, విద్య, కఠోర శ్రమ ద్వారా తమ కలలను సాకారం చేసుకోవాలని ఆయన ఆకాంక్షించారు. "కొత్త ఆశతో ఈ విద్యా సంవత్సరం మొదటి రోజును ప్రారంభిస్తున్న నా ప్రియమైన విద్యార్థులకు హృదయపూర్వక శుభాకాంక్షలు. విద్య అనేది మీ భవిష్యత్తును ప్రకాశవంతం చేసే శక్తి. ఉన్నతమైన కలలను ఎంచుకోండి. దానికి అనుగుణంగా కష్టపడండి. మీరు పాఠశాలకు వెళ్లే ప్రతి రోజూ మీ జీవితంలో ఒక ముందడుగు కావాలి. ఆనందంతో నేర్చుకోండి, విజయం మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తుంది." అని ముఖ్యమంత్రి విజయ్ ఎక్స్ లో పేర్కొన్నారు. ఇటీవల ప్రకటించిన 10వ తరగతి బోర్డు పరీక్షల ఫలితాల్లో విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబరిచిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో మొత్తం ఉత్తీర్ణత శాతం 94.31 శాతంగా నమోదైందని మే 20న విద్యాశాఖ మంత్రి రాజ్‌మోహన్ ప్రకటించారు. గత ఏడాదితో పోలిస్తే 0.51 శాతం ఎక్కువ. అధికారిక గణాంకాల ప్రకారం మొత్తం 8,79,643 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, వారిలో 8,21,105 మంది విజయవంతంగా ఉత్తీర్ణులయ్యారు. ఈ ఫలితాల్లోనూ బాలికలు తమ ఆధిక్యతను చాటుకున్నారు. బాలుర ఉత్తీర్ణత శాతం 92.15 కాగా, బాలికలు 96.6 శాతంతో ముందంజలో నిలిచారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థలు కూడా ఈ పరీక్షల్లో అద్భుతమైన ఫలితాలను సాధించాయి. 1,931 ప్రభుత్వ పాఠశాలలతో సహా మొత్తం 5,171 పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించి రికార్డు సృష్టించాయి. జిల్లాల వారీగా చూస్తే, 97.57 శాతం ఉత్తీర్ణతతో పుదుక్కోట్టై జిల్లా రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిచింది. ఫలితాల ప్రకటన తర్వాత స్కూల్ డ్రాపౌట్స్ పై వ్యక్తమవుతున్న ఆందోళనలపై ఆయన స్పందించారు. ప్రభుత్వం నిరంతరం బాలల కేంద్రీకృత విధానాలపైనే దృష్టి సారిస్తుందని, విద్యార్థులెవరూ చదువును మధ్యలో ఆపేయకుండా తగిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

# విద్రోహానికి పుష్కరం




సమైక్య ఆంధ్రప్రదేశ్ విభజన జరిగి పన్నెండేళ్లు పూర్తయ్యాయి. 2014 జూన్ 2న సమైక్య రాష్ట్రాన్ని విభజించినప్పుడు ఆ ప్రక్రియ వల్ల తీవ్రంగా నష్టపోయే ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేస్తామని పార్లమెంట్ హామీ ఇచ్చింది. రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ చట్టం, రాజ్యసభలో అప్పటి ప్రధానమంత్రి చేసిన ప్రకటనలు, వివిధ జాతీయ పార్టీలు ఇచ్చిన హామీలు రాష్ట్ర ప్రజల్లో కొంత మేర నమ్మకాన్ని కలిగించాయి. హైదరాబాద్ వంటి సిద్ధంగా ఉన్న రాజధానిని, భారీ ఐటీ- సేవారంగ ఆదాయాన్ని, పెట్టుబడుల కేంద్రాన్ని కోల్పోయిన రాష్ట్రానికి ప్రత్యేక రాయితీలు, ప్రత్యేక హోదా, ఆర్థిక సహాయం, జాతీయ ప్రాజెక్టులు, పారిశ్రామిక ప్రోత్సాహకాలు అందించి అభివృద్ధి బాటలో నిలబెడతామని అప్పట్లో చెప్పారు. కానీ పన్నెండేళ్ల తరువాత వాస్తవ పరిస్థితిని పరిశీలిస్తే పూర్తిగా భిన్నమైన దృశ్యాలు కనిపిస్తాయి. రాష్ట్ర విభజన సమయంలో కేంద్ర ప్రభుత్వం స్వయంగా ఆంధ్రప్రదేశ్‌కు భారీ రెవెన్యూ లోటు ఏర్పడుతుందని అంగీకరించింది. 2014-15 సంవత్సరంలోనే రాష్ట్రానికి సుమారు రూ.16,000 కోట్లకు పైగా రెవెన్యూ లోటు ఉందని గుర్తించారు. అలాంటి పరిస్థితిలో ప్రత్యేక హోదా రాష్ట్రానికి ఆర్థిక ఆక్సిజన్‌లా ఉపయోగపడాల్సింది. అయితే, ఎన్నికల తరువాత అధికారంలోకి వచ్చిన నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆ అంశాన్ని పూర్తిగా పక్కన పెట్టింది. ఇదే సమయంలో రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలో పొందుపరిచిన రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీలు నేటికీ అమలు కాలేదు. అనంతపురం, కర్నూలు, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో యువత ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లే పరిస్థితి ఈనాటికీ కొనసాగుతోంది. అలాగే విశాఖపట్నం కేంద్రంగా రైల్వే జోన్, కడప ఉక్కు కర్మాగారం, దుగరాజపట్నం ఓడరేవు, పారిశ్రామిక కారిడార్లు, పెట్రోకెమికల్ హబ్ వంటి హామీలు కూడా పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చలేదు. కొన్ని కాగితాలపై నిలిచిపోయాయి. మరికొన్ని నత్తనడకన సాగుతున్నాయి. పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించినప్పటికీ అది ఇప్పటికీ పూర్తికాలేదు. వ్యయం అనేక రెట్లు పెరిగింది. ప్రాజెక్టు కోసం తమ సర్వస్వాన్ని త్యాగం చేసిన వేలాది గిరిజన కుటుంబాల పునరావాసం ఇప్పటికీ అసంపూర్తిగా ఉంది. రాష్ట్రానికి రాజధాని నిర్మాణంలో సహకరిస్తామంటూ చట్టంలో చెప్పిన మాటను కూడా కేంద్రం పూర్తిగా నిర్వర్తించలేదు మొత్తంగా చూస్తే పునర్వ్యవస్థీకరణ చట్టంలోని అనేక అంశాలు పన్నెండేళ్ల తరువాత కూడా అమలు కోసం ఎదురుచూస్తూనే ఉన్నాయి. ఇవి చాలవన్నట్లు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ, కార్పొరేట్లకు భూముల సంతర్పణ వంటి అంశాలు ఈ కాలంలోనే ముందుకు వచ్చాయి. మరోవైపు రాష్ట్రాన్ని పాలించిన తెలుగుదేశం, వైసిపి లు ప్రజల హక్కుల సాధనలో ఘోరంగా విఫలమయ్యాయి. రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రాన్ని నిలదీయడానికి బదులు తమ సొంత ప్రయోజనాల పరిరక్షణకే అవి ప్రాధాన్యత ఇచ్చాయి. ప్రజల ఆశలను, భావోద్వేగాలను, ప్రాంతీయ ఆవేదనను ఎన్నికల సమయంలో ఉపయోగించుకుని, తరువాత పక్కనపెట్టడం రాష్ట్ర రాజకీయాల్లో ఒక దురదృష్టకర సంప్రదాయంగా మారిపోయింది. రాష్ట్రాభివృద్ధికి వామపక్షాలు నిరంతరం ఉద్యమిస్తూనే వున్నాయి. ఇది, రాష్ట్రానికి తీరని విద్రోహం జరిగిన పుష్కర సంవత్సరం. నెరవేరని వాగ్దానాలను గుర్తు చేసుకునే సందర్భం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుత్సిత వైఖరిని గుర్తుచేసుకునే సందర్భం. ఆంధ్రప్రదేశ్ విభజనను కేవలం చరిత్రలో జరిగిన ఒక రాజకీయ సంఘటనగా చూడటం సరైంది కాదు. ఇది ఇప్పటికీ కొనసాగుతున్న ఒక అసంపూర్ణ ప్రక్రియ. ఎందుకంటే విభజన సమయంలో ఇచ్చిన హామీలు పూర్తిగా అమలు కాలేదు. రాష్ట్రానికి రావాల్సిన హక్కులు పూర్తిగా అందలేదు. అభివృద్ధి అసమానతలు తగ్గలేదు. ఆనాటి గాయాలు ఇంకా మానలేదు. రాష్ట్ర ప్రజానీకం విభజన వల్ల ఒకసారి, ఆ నష్టాలను భర్తీ చేయాల్సిన హామీలు అమలు కాకపోవడం వల్ల రెండవ సారి నష్టపోయారు. పన్నెండేళ్ల తరువాత కూడా విభజన నష్టాల గురించి, హామీల అమలు వైఫల్యం గురించి మాట్లాడుతున్నామంటే దానికి ప్రధాన కారణం కేంద్ర పాలకుల విద్రోహం, రాష్ట్ర పాలకుల అవకాశవాదం! రాష్ట్ర ప్రజల సహనాన్ని బలహీనతగా భావించే పార్టీలు చరిత్ర ముందు సమాధానం చెప్పక తప్పదు. దేశ పార్లమెంట్ ఇచ్చిన మాటపై ఉన్న విశ్వాసాన్ని పునరుద్ధరించడం ఇప్పుడు రాజకీయ పక్షాల బాధ్యత!

# రకుల్ ప్రీత్ సింగ్ వేగం అక్కడా తగ్గిందే!





-స్పైడర్- రిలీజ్ ముందు వరకూ రకుల్ ప్రీత్ సింగ్ టాలీవుడ్ లో ఎంత బిజీగా ఉండేదో చెప్పాల్సిన పనిలేదు. వరుసగా స్టార్ హీరోల సినిమాలతో క్షణం తీరిక లేకుండా గడిపేది. జయాపజయాలతో సంబంధం లేకుండా అమ్మడు తెలుగు అవకాశాలు అందుకుంది. కానీ -స్పైడర్- రిలీజ్ అనంతరం సీన్ మారింది. అప్పటి నుంచి అవకాశాలు తగ్గాయి. అలాగని పూర్తిగా అవకాశాలే లేకుండా పోలేదు. ఏదో సినిమాలో ఛాన్స్ అందుకుని టచ్ లో ఉండేది. కానీ బాలీవుడ్ లో రీలాంచ్ అయిన తర్వాత మాత్రం తెలుగు సినిమాల్ని లైట్ తీసుకుంది. ఆ సమయంలో వచ్చిన టాలీవుడ్ అవకాశాలు కూడా కాదంది. కానీ అనూహ్యంగా బాలీవుడ్ అవకాశాలతో బిజీ అయింది. ఎంతలా అంటే ఊపిరి సలపనంతగా సినిమాలు చేసింది. ఇదే సమయంలో వరుసగా కోలీవుడ్ లో కూడా అవకాశాలు ఊపందుకున్నాయి. దీంతో తమిళ, హిందీ భాషల్ని బ్యాలెన్స్ చేసి కెరీర్ ని ముందుకు తీసుకెళ్లింది. దాదాపు కెరీర్ మొత్తంలో ఇప్పటి వరకూ 18 హిందీ సినిమాలు చేసింది. -యారియాన్- బాలీవుడ్ అరంగేట్రం చేసింది. అటుపై -అయ్యారీ-, - దే దే ప్యార్ దే- లో నటించింది. ఈ సినిమా అమ్మడికి బాలీవుడ్ లో మంచి బ్రేక్ ఇచ్చింది. అనంతరం -మర్జావాన్-, -షిమ్లా మిర్చి-, -సర్దార్ కా గ్రాండ్‌సన్,- అటాక్: పార్ట్ 1-, -రన్‌వే 34-, -కట్‌పుత్లీ-, -డాక్టర్ జి,- -థాంక్ గాడ్-, -ఛత్రీవాలీ-, -ఐ లవ్ యు-, -హిందుస్థానీ 2-, - మేరే హస్బెండ్ కీ బీవీ- , -దే దే ప్యార్ దే 2- లో నటించింది. అయితే బాలీవుడ్ లో రకుల్ ప్రీత్ సింగ్ వేగం బాగా తగ్గింది. ప్రస్తుతం అమ్మడి ఖాతాలో ఒకే ఒక్క ప్రాజెక్ట్ ఉంది. -పతి పత్నీ ఔర్ వో 2- లో నటిస్తోంది. ఈ సినిమా మినహా కొత్త ప్రాజెక్టులు వేటికి అమ్మడు సైన్ చేసింది లేదు. ఈ సినిమా కూడా గత ఏడాది కమిట్ అయిన చిత్రం. కొత్త ఏడాదిలో ఎలాంటి కథలు విన్నట్లు బాలీవుడ్ లో ప్రచారం కూడా జరగలేదు. దీంతో ఉత్తరాదిన రకుల్ హవా తగ్గిందా? అన్న ప్రచారం ఊపందుకుంది. అటు భర్త జాకీ భగ్నానీ కూడా ఆర్థిక సంక్షోభంలో ఉన్న సంగతి తెలిసిందే. వరుస ఫ్లాప్ లతో పూజ ఎంటర్ టైన్ మెంట్స్ నష్టాల్లో కూరుకుపోయింది. దీంతో ఉన్న ఆస్తులు కూడా అమ్మాల్సి వచ్చింది. ఈ సమయంలో రకుల్ సినిమాలు కొంత కాలం పాటు ఫ్యామిలీకి అండగా నిలిచాయి. కానీ ఇప్పుడు ఆమెకు అవకాశాలు తగ్గడం మరింత ప్రతికూల పరిస్థితులకు దారి తీసే అవకాశం ఉంది.

# సిల్వర్ గౌనులో దేవకన్యలా ఊర్వశి రౌతేలా..

కేన్స్‌లో మరోసారి తన మార్క్ చూపిన బ్యూటీ!


79వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ ప్రారంభోత్సవంలో ఊర్వశి రౌతేలా

భారీ సిల్వర్ గౌనులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన నటి

పక్షి ఆకారంలో ఉన్న తల ఆభరణం ప్రధాన హైలైట్

తనదైన మాక్సిమలిస్ట్ స్టైల్‌తో మరోసారి అందరి దృష్టిని ఆకర్షించిన ఊర్వశి

వియత్నాం లేబుల్ రూపొందించిన కస్టమ్ గౌనులో మెరుపులు



ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ 79వ ఎడిషన్ అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఫ్రాన్స్‌లోని ఫ్రెంచ్ రివేరాలో మే 12 నుంచి 23 వరకు జరిగే ఈ వేడుకకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ, ఫ్యాషన్ ప్రముఖులు హాజరయ్యారు. అలియా భట్, డెమీ మూర్ వంటి తారలు ప్రారంభోత్సవంలో తమ స్టైల్‌తో ఆకట్టుకోగా, బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలా తనదైన ప్రత్యేకమైన డ్రెస్సింగ్ స్టైల్‌తో రెడ్ కార్పెట్‌పై ప్రధాన ఆకర్షణగా నిలిచారు. ప్రారంభోత్సవం కోసం ఊర్వశి వియత్నాంకు చెందిన ఫ్యాషన్ లేబుల్ 'జోలీపోలీ' డిజైన్ చేసిన కస్టమ్ కౌచర్ గౌనును ఎంచుకున్నారు. లావెండర్ రంగు బేస్‌పై భారీ సిల్వర్ అలంకరణతో ఉన్న ఈ గౌను చూడగానే కట్టిపడేసింది. క్రిస్టల్స్, సీక్విన్స్, పూసలు, రాళ్ల వర్క్‌తో గౌను మొత్తం కేన్స్ లైట్ల వెలుగులో తళతళా మెరిసింది. మత్స్యకన్య ఆకారాన్ని పోలి ఉన్న ఈ గౌను ఆమె అందాన్ని రెట్టింపు చేసింది. ఈ డ్రెస్ ప్రత్యేకతల్లో కార్సెట్ తరహాలో ఉన్న బాడీస్ ఒకటి. గౌనుపై శిల్పం చెక్కినట్టుగా వెండి ఎంబ్రాయిడరీతో సున్నితమైన డిజైన్లు ఉన్నాయి. స్వీట్‌హార్ట్ నెక్లైన్‌తో పాటు భుజాల వద్ద ఉన్న అలంకరణలు డ్రెస్‌కు మరింత ఆకర్షణను తెచ్చిపెట్టాయి. పొడవైన కేప్ స్లీవ్స్, వాటికి వేలాడుతున్న క్రిస్టల్ టాసెల్స్... వెండి రెక్కలు తొడుక్కున్నట్టుగా ఆకర్షించాయి. "ఐసీ సిల్వర్" థీమ్‌కు తగ్గట్టుగానే ఊర్వశి ఆభరణాలను ధరించారు. స్టేట్‌మెంట్ చోకర్ నెక్లెస్, దానికి సరిపోయే చెవిపోగులు, బ్రేస్‌లెట్‌తో పాటు జుట్టు ముడి మధ్యలో పక్షి ఆకారంలో ఉన్న మాంగ్ టిక్కా తరహా తల ఆభరణం అందరి దృష్టినీ ఆకర్షించింది. గౌను మొత్తం ఒకే రంగులో ఉన్నప్పటికీ, ఆమె చేతిలో పట్టుకున్న రంగురంగుల రాళ్లు, అద్దాలతో పొదిగిన బాక్స్ క్లచ్ ప్రత్యేకంగా నిలిచింది. ఇక పూర్తి గ్లామ్ మేకప్‌తో ఊర్వశి మరింత ప్రకాశవంతంగా కనిపించారు. సిల్వర్ షిమ్మర్ ఐస్, నిగనిగలాడే పెదవులు, ముఖానికి ఫ్రేమ్‌లా ఉన్న హెయిర్‌స్టైల్‌తో తన లుక్‌ను పూర్తి చేశారు. మొత్తంగా తనదైన బోల్డ్, మాక్సిమలిస్ట్ రెడ్ కార్పెట్ స్టైల్‌ను ఊర్వశి మరోసారి కేన్స్‌లో ప్రదర్శించారు.

# జక్కన్న 'వారణాసి'.. ఫస్ట్ ఇండియన్ మూవీ అవుతుందా?





దర్శకధీరుడు ఎస్ ఎస్ రాజమౌళి, టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు కాంబినేషన్ లో తెరకెక్కుతున్న వారణాసి మూవీపై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. ఇప్పటి వరకు ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీ చరిత్రలో నెవ్వర్ బిఫోర్ అనేలా సినిమా రూపొందుతుందని తెలుస్తోంది. తాజాగా వారణాసి.. ఓ విషయంలో ఫస్ట్ ఇండియన్ మూవీగా నిలవనుందని టాక్ వినిపిస్తోంది. నిజానికి వారణాసిపై మంచి అంచనాలు నెలకొనగా.. థియేట్రికల్ రైట్స్ కు భారీ డిమాండ్ ఉన్నట్లు తెలుస్తోంది. వచ్చే ఏడాది సినిమా రిలీజ్ కానుండగా.. ఇప్పటి నుంచే పెద్ద ఎత్తున ఆఫర్స్ వస్తున్నాయని సమాచారం. ఓవర్సీస్ రైట్స్ కోసం ఒక ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ దాదాపు రూ.160 కోట్ల ఆఫర్ ఇచ్చినట్లు సోషల్ మీడియాలో ఊహాగానాలు చక్కర్లు కొడుతున్నాయి. కాశ్రీంశీ అందులో నిజమెంతో తెలియదు కానీ.. నెట్టింట ప్రచారం మాత్రం జరుగుతోంది. ఒకవేళ ఆ డీల్ ఖరారైతే, ఓవర్సీస్ రైట్స్ రూపంలోనే అంత భారీ మొత్తాన్ని అందుకున్న తొలి భారతీయ సినిమాగా వారణాసి రికార్డు సృష్టించే అవకాశం ఉందని తెలుస్తోంది. అదే సమయంలో ఇంకా ఓవర్సీస్ రైట్స్ ఆఫర్ పై వారణాసి మేకర్స్ డిసైడ్ అవ్వలేదని వార్తలు వస్తున్నాయి. నిజానికి ఒక సినిమాపై ఆసక్తి పెరగడానికి ట్రైలర్ లేదా టీజర్ కారణమవుతుంది. కానీ వారణాసి విషయంలో మాత్రం టైటిల్ గ్లింప్స్ విడుదలతోనే భారీ చర్చ మొదలైంది. దర్శకుడు రాజమౌళి తన ప్రత్యేక శైలిలో కథ రేంజ్ తో పాటు సినిమా ప్రపంచాన్ని పరిచయం చేస్తూ గ్లింప్స్ ను రూపొందించడంతో ప్రేక్షకుల్లో ఓ రేంజ్ లో అంచనాలు నెలకొన్నాయి. ఇప్పుడు ఓవర్సీస్ భారీ ఆఫర్ కు ఆ గ్లింప్సే కారణమని చెప్పాలి. ఇక సినిమా విషయానికొస్తే.. ఫాంటసీ మైథలాజికల్ జోనర్ లో తెరకెక్కుతున్న మూవీలో మహేష్ బాబు భిన్నమైన పాత్రలో కనిపించబోతున్నారు. ముఖ్యంగా ఆయన రాముడి రూపంలో కనిపించే సన్నివేశాలు సినిమాలో కీలకంగా ఉంటాయని ప్రచారం జరుగుతోంది. ఇది మహేష్ కెరీర్ లోనే అత్యంత భారీ ప్రాజెక్ట్ అని చెప్పాలి. ఆయనతోపాటు బాలీవుడ్ స్టార్ హీరో ప్రియాంక చోప్రా కీలక పాత్ర పోషిస్తున్నారు. మందాకినిగా కనిపించనున్నారు. మాలీవుడ్ నటుడు పృథ్వీరాజ్ సుకుమార్ విలన్ కుంభ పాత్రలో నటిస్తున్నారు. ఆస్కార్ అవార్డు విన్నింగ్ మ్యూజిక్ డైరెక్టర్ కీరవాణి సంగీతం అందిస్తున్నారు. శ్రీ దుర్గా ఆర్ట్స్ బ్యానర్ పై కేఎల్ నారాయణ భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. కథ, విజువల్స్, యాక్షన్ ఎపిసోడ్స్ అన్నీ ఇంటర్నేషనల్ లెవెల్ లో ఉండేలా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. వారణాసి చిత్రాన్ని 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని నిర్మాతలు టార్గెట్ పెట్టుకున్నారు. ముఖ్యంగా 120కి పైగా దేశాల్లో రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నారు.

# జోరు పెంచిన నయనతార.. మరో క్రేజీ హీరోతో ఛాన్స్!





ప్రతిభతో పాటు అదృష్టం కూడా ఉంటే ఇండస్ట్రీని దశాబ్దాల పాటు ఏలేయొచ్చు అని నిరూపిస్తున్న అతి కొద్ది మంది హీరోయిన్స్ లో నయనతార ప్రథమ స్థానంలో నిలుస్తుంది. సౌత్ లేడీ సూపర్ స్టార్ గా పేరు దక్కించుకున్న ఈమె తమిళ్, మలయాళం, తెలుగు , హిందీ భాషల్లో సినిమాలు చేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఒకవైపు హీరోయిన్ పాత్రలతో మరొకవైపు ఆధ్యాత్మిక పాత్రలతో మెరిసిన నయనతార.. అటు యాక్షన్ పెర్ఫార్మెన్స్ తో కూడా అదరగొడుతున్న విషయం తెలిసిందే. ఒకవైపు హీరోయిన్గా మరొకవైపు నిర్మాతగా కూడా అడుగులు వేస్తున్న ఈమె.. ఇప్పుడు ఏకంగా టాలీవుడ్ మొదలుకొని బాలీవుడ్ వరకు సీనియర్ స్టార్ హీరోలకు కేరాఫ్ అడ్రస్ గా మారింది. విషయంలోకి వెళ్తే .. ప్రముఖ కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ విఘ్నేష్ శివన్ ను ప్రేమించి పెళ్లి చేసుకున్న ఈమె.. సరోగసి ద్వారా ఇద్దరు మగ కవల పిల్లలకు జన్మనిచ్చింది. వివాహం తర్వాత ఈమె జోరు మరింత పెరిగిందనే చెప్పాలి. ఇందులో భాగంగానే .. 2023లో షారుక్ ఖాన్ తో కలిసి 'జవాన్' సినిమా చేసి ఊహించని పాపులారిటీ సొంతం చేసుకుంది. అటు బాలీవుడ్ లో కూడా తన మార్కెట్ ను పెంచుకుంది ఈ ముద్దుగుమ్మ. ఈ ఏడాది మెగాస్టార్ చిరంజీవితో 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమా చేసి ఇండస్ట్రీ హిట్ ను తన ఖాతాలో వేసుకుంది అంతేకాదు తాను పెట్టుకున్న కండిషన్స్ అన్నింటిని కూడా పక్కన పెట్టి మరీ ఈ సినిమాను ప్రమోట్ చేసి వార్తల్లో నిలిచింది నయనతార. అయితే అలాంటి ఈమె ఇప్పుడు మరో క్రేజీ హీరో సరసన నటించే అవకాశాన్ని అందుకున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై త్వరలో అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలు ఉన్నాయి. ఆయన ఎవరో కాదు బాలీవుడ్ స్టార్ హీరో, కండల వీరుడు సల్మాన్ ఖాన్. వంశీ పైడిపల్లి దర్శకత్వంలో దిల్ రాజు నిర్మాణంలో రూపుదిద్దుకుంటున్న ఒక బడా ప్రాజెక్టులో నయనతార అవకాశం అందుకున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇక దీనిపై త్వరలోనే అటు చిత్ర బృందం నుండి లేదా ఇటు నయనతార నుండి అధికారిక అనౌన్స్మెంట్ వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఏది ఏమైనా వయసు పెరుగుతున్నా కూడా నయనతార క్రేజ్ ఏమాత్రం తగ్గట్లేదు.. లేడీ సూపర్ స్టార్ అనే ట్యాగ్ కి తగ్గట్లుగానే స్టార్ హీరోల సినిమాలలో అవకాశాలు అందుకుంటూ దూసుకుపోతోంది. ఇక ఎంతోమందికి రోల్ మోడల్ గా నిలిచిన నయనతార ప్రతిభతో పాటు అదృష్టాన్ని కూడా మూటగట్టుకొని ఇండస్ట్రీలో స్టార్ హీరోలతో సమానంగా దూసుకుపోతూ ఉండడం విశేషం. ఇక నయనతార ప్రస్తుత సినిమాల విషయానికొస్తే.. ఒకవైపు స్టార్ హీరోల సినిమాలలో హీరోయిన్ గానే కాకుండా.. మరొకవైపు లేడీ ఓరియంటెడ్ చిత్రాలతో కూడా అలరిస్తోంది. అందులో భాగంగానే గతంలో వచ్చిన మూకుత్తి అమ్మన్ సినిమాకి సీక్వెల్ గా వస్తున్న మూకుత్తి అమ్మన్ 2లో నటిస్తోంది. ఈ చిత్రానికి ప్రముఖ స్టార్ డైరెక్టర్ సుందర్ సి దర్శకత్వం వహిస్తున్నారు. అలాగే గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో వరల్డ్ కమర్షియల్ ఎంటర్టైనర్ గా తెరకెక్కుతున్న టాక్సిక్ సినిమాలో కూడా అవకాశం అందుకుంది . కన్నడ హీరో యష్ లీడ్రోల్ పోషిస్తున్న ఈ సినిమాలో ఆయనకు సోదరి పాత్రలో యాక్షన్ పర్ఫామెన్స్ తో అదరగొట్టడానికి సిద్ధమయ్యింది నయనతార. అలాగే బాలకృష్ణ, గోపీచంద్ మలినేని కాంబినేషన్లో వస్తున్న ఎన్బికె 111 సినిమాలో హీరోయిన్గా అవకాశం అందుకుంది. ఏదిఏమైనా అటు క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా ఇటు హీరోయిన్ మరొకవైపు లేడీ ఓరియంటెడ్ చిత్రాలతో కూడా అలరిస్తోంది.

# పక్కా ప్లానింగ్ ఉంటే ఏదైనా సాధ్యమే

తల్లయ్యాక తన ప్రాధాన్యతలు మారాయన్న కరీనా కపూర్

రోజుకు 8 గంటలు మాత్రమే పని చేస్తానని వెల్లడి

పక్కా ప్లానింగ్ తో పిల్లల బాధ్యతను మేనేజ్ చేశానన్న కరీనా

తన భర్త పిల్లలను చూసుకున్నారని వెల్లడి





బాలీవుడ్ టాప్ హీరోయిన్లు దీపికా పదుకొణె, కరీనా కపూర్ ఖాన్ తల్లయ్యాక కెరీర్‌ను, పిల్లల బాధ్యతలను ఎలా బ్యాలెన్స్ చేయాలనే విషయంపై భిన్నమైన అభిప్రాయాలను పంచుకోవడం ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చకు దారితీసింది. పని గంటల పరిమితిపై దీపికా చేసిన వ్యాఖ్యలు ఒకెత్తు అయితే, ప్లానింగ్ ఉంటే ఏదైనా సాధ్యమేనని కరీనా చెప్పడం మరో ఎత్తు.

తల్లయ్యాక తన ప్రాధాన్యతలు మారాయని, రోజుకు 8 గంటలు మాత్రమే పని చేస్తానని దీపిక స్పష్టం చేశారు. కొత్తగా తల్లయిన వారికి చిత్ర పరిశ్రమ, కుటుంబం మద్దతుగా నిలవాలని ఆమె కోరారు. అయితే, ఈ నిబంధన వల్ల భారీ ప్రాజెక్టులైన 'కల్కి 2898 ఏడీ' సీక్వెల్, ప్రభాస్-సందీప్ వంగా 'స్పిరిట్' వంటి సినిమాల నుంచి ఆమె తప్పుకోవాల్సి వచ్చిందని వార్తలు వినిపిస్తున్నాయి. దీనిపై నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు. కొందరు ఆమె నిర్ణయాన్ని సమర్థిస్తుంటే, మరికొందరు సినిమా మేకింగ్‌లో ఇది ఎప్పుడూ సాధ్యం కాదని విమర్శిస్తున్నారు. మరోవైపు కరీనా స్పందిస్తూ... 'ద బకింగ్‌హామ్ మర్డర్స్' షూటింగ్ కోసం లండన్‌లో 35 రోజులు ఉండాల్సి వచ్చినప్పుడు, పక్కా ప్లానింగ్‌తో పిల్లల బాధ్యతను మేనేజ్ చేశానని చెప్పారు. తను పనిలో ఉన్నప్పుడు భర్త సైఫ్ అలీ ఖాన్ ఇంట్లో పిల్లలతో ఉండి చూసుకున్నారని, ఇద్దరూ ఒకేసారి పని కోసం బయటకు వెళ్లకూడదనే నిబంధన పెట్టుకున్నామని తెలిపారు. షూటింగ్ మధ్యలో విరామం తీసుకుని ఇండియా వచ్చి పిల్లలతో గడిపేలా చిత్ర యూనిట్ సహకరించిందని, అన్నీ ముందుగానే ప్లాన్ చేసుకుంటే ఇబ్బంది ఉండదని ఆమె అభిప్రాయపడ్డారు. మొత్తానికి, దీపికా 'పని గంటల తగ్గింపు'ను కోరుతుంటే, కరీనా మాత్రం 'పరస్పర అవగాహన, ప్లానింగ్' తో ముందుకు వెళ్లవచ్చని సూచిస్తున్నారు.

NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .